
జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 21, డిసెంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

# సెంటు భూమి కబ్జా చేసినా ఖబడ్దార్



- భూ కబ్జాలు, మోసాలు, బెదిరింపులకు పాల్పడితే జైలే దిక్కు
- భూ సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం, రీసర్వేలోని తప్పులనూ సరిచేస్తాం
- ప్రతిఒక్కరికీ న్యాయం చేయాలనేది నా ఆలోచన, ఎన్డీఏ ప్రభుత్వం ఆలోచన
- ఎంతో నమ్మకంతో 57 శాతం ఓట్లతో మమ్మల్ని గెలిపించారు
- ప్రజల ఆశల్ని నెరవేర్చేందుకు ఆర్నెళ్లుగా కష్టపడుతున్నాం
- గత ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసింది
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మన భూమికి దిక్కులేకుండా చేసే పరిస్థితిని తీసుకొచ్చారు
- రెవెన్యూ సదస్సుల ద్వారా 95,263 పిటిషన్లు వచ్చాయి
- దాదాపు 3 లక్షల మంది సదస్సులకు హాజరయ్యారు
- పాస్‌పుస్తకంపై క్యూఆర్ కోడ్, జియో ట్యాగింగ్‌తో ఎప్పటికప్పుడు రికార్డులను పరిశీలించుకునే అవకాశం కల్పిస్తాం
- ఈడుపుగల్లు రెవెన్యూ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


కృష్ణాజిల్లా(ఈడుపుగల్లు),మహానాడు: కృష్ణాజిల్లా, పెనమలూరు నియోజకవర్గంలోని ఈడుపుగల్లు గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ప్రజల నుంచి రెవెన్యూ సమస్యలకు సంబంధించి పిటిషన్లను స్వయంగా స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 57 శాతం ఓట్లతో గొప్ప మెజారిటీతో గెలి పించి ఎన్డీఏ ప్రభుత్వంపై మీరు పెట్టుకున్న ఆశలను నెరవేర్చేందుకు ఆర్నెళ్లుగా కష్టపడుతున్నామని.. ఇంకా కష్టపడతామని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపించాలనేది మా ఆలోచన అని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వం భూకబ్జాలతో మొదలుపెట్టి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసింది. విధ్వంసం సృష్టించారు.

మన జీవితాలను అంధకారంలోకి నెట్టారు. గతంలో ఎప్పుడూ ఇన్ని ఇబ్బందులు చూడలేదు. ఇది ప్రజాప్రభుత్వం.. ప్రజల ఆశల మేరకు పని చేసే ప్రభుత్వం ఇదని స్పష్టమైన హామీ ఇస్తున్నా. ఒకవైపు అవినీతి.. మరోవైపు వ్యవస్థల విధ్వంసం.. అధికార యంత్రాంగాన్ని నిర్వీర్యం చేయడం.. ఇలా అనేక సమస్యలను సృష్టించారు. ఇప్పటివరకు లక్షా 57 వేల 481 అర్జీలు నా దగ్గరకు వచ్చాయి. రికార్డ్ ఆఫ్ రైట్స్ కోసం 78,854 దరఖాస్తులు వచ్చాయి. ఇంటి జాగా కోసం 9,830 వినతులు, ల్యాండ్ గ్రాబింగ్‌కు సంబంధించి 9,528 ఫిర్యాదులు వచ్చాయి.

ఇవికాకుండా గవర్నమెంట్ భూమి కోసం 8,366 దరఖాస్తులు వచ్చాయి. ఆక్రమణలకు సంబంధించి 8,227 వచ్చాయి. అధికార యంత్రాంగంపైన ఫిర్యాదులు 8 వేలు వచ్చాయి. 22ఏ ద్వారా అక్రమాలకు పాల్పడ్డారు. పట్టా భూములను కబ్జాచేశారు. ఒకటి రెండు కాదు కొన్ని వందల కేసులు జరిగాయి. ఇవన్నీ చూసిన తర్వాత నేను ఒక్కటే నిర్ణయించుకున్నాను. మీ భూమిని మీకు ఇప్పించే బాధ్యత తీసుకొని పట్టుదలతో ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు.

### భూమి అనేది భవిష్యత్తుకు సంబంధించిన అంశం

భూమి అనేది ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని.. ఒక గజమైనా, సెంటు అయినా, ఎకరా అయినా మిగతా.. 2లో






# నాయుడు చెప్పారు.. సీఎంఓ వద్దంది?!

మహానాడు ఫోకస్

- తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ వ్యాఖ్యలపై రగడ
- తెలంగాణ ప్రజల దర్శనాలకు ఇబ్బంది ఎందుకు కలిగిస్తున్నారన్న శ్రీనివాసగౌడ్
- తెలంగాణలో ఆంధ్రావాళ్లు కాంట్రాక్టులు, వ్యాపారాలు చేసుకోవడం లేదా అన్న ప్రశ్న
- ఇలాగైతే తెలంగాణలో ఉన్న ఆంధ్రావాళ్లు భవిష్యత్తులో ఇబ్బంది పడతారని హెచ్చరిక
- చైర్మన్‌కు స్వేచ్ఛ ఇస్తే తెలంగాణకు న్యాయం జరుగుతుందని వ్యాఖ్య
- మాజీ మంత్రి వ్యాఖ్యలపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆగ్రహం
- నిబంధనల ప్రకారం ఆయనపై కేసు పెట్టాలని చైర్మన్ ఆదేశం
- కేసు వద్దంటూ సీఎంఓ కీలక అధికారి టీటీడీ అధికారికి ఫోన్?
- ప్రాంతీయ విద్వేషాలకు కారణమవుతుందన్న భయమే కారణమా?
- రేపు వైసీపీ నేతలు మాట్లాడినా కేసులు పెట్టలేం కదా అంటున్న బోర్డు సభ్యులు
- శ్రీనివాసగౌడ్‌పై ఏం చర్యలు తీసుకున్నారో బోర్డు మీటింగ్‌లో ఈఓను అడుగుతామన్న సభ్యులు
- అసలు కొండపై మీడియా ఎందుకంటున్న భక్తులు
- మీడియాను నిషేధిస్తే నాయకులు మాట్లాడరు కదా అన్న ప్రశ్నలు







(మార్తి సుబ్రహ్మణ్యం)

**"తెలంగాణ ఏర్పడిన తర్వాత భారీగా లబ్ధిపొందింది ఆంధ్రావాళ్లే. వ్యాపారాలు, కాంట్రాక్టులు చేస్తూ పదవుల్లో లబ్ధిపొందుతున్నది కూడా ఆంధ్రావాళ్లే. గతంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లెటర్లకు ప్రాధాన్యం ఉండేది. కూటమి ప్రభుత్వం దానిని తొలగించడం అన్యాయం. దేవుడి ముందు అందరినీ సమానంగా చూడాలి. తెలంగాణ ప్రజలు, ప్రజాప్రతినిధుల పట్ల టీటీడీ వివక్ష చూపడం న్యాయం కాదు. తెలంగాణ పట్ల వివక్ష చూపితే రాబోయే రోజుల్లో, తెలంగాణలో ఆంధ్రావారికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. టీటీడీ చైర్మన్‌కు పూర్తి స్వేచ్ఛ ఇస్తే తెలంగాణ ప్రజలకు న్యాయం జరుగుతుంది. తెలంగాణ ప్రజలకు ఆంధ్ర ప్రాంతంతో ఉన్న ఏకైక అనుబంధం తిరుమల మాత్రమే. తెలంగాణలో పుట్టిన ప్రతిబిడ్డ శ్రీవారిని దర్శించుకుని, తలనీలాలు సమర్పించుకోవాలని ఆశిస్తాడు. గతంలో దర్శనాల విషయంలో ఎలాంటి తేడాలు రాలేదు. జగన్ కూడా దానినే కొనసాగించారు. కానీ ఇప్పుడు తెలంగాణ భక్తుల పట్ల తేడా చూపిస్తున్నారు. ఇది మంచి పరిణామం కాదు"**

– ఇదీ.. తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీనివాసగౌడ్ తిరుమలలో వెంకన్నను దర్శించు కున్న తర్వాత మీడియానుద్దేశించి చేసిన వ్యాఖ్యలు.

మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ వ్యాఖ్యలు మీడియా–సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఆయన వ్యాఖ్యలకు మీడియా ప్రాధాన్యం ఇచ్చింది. నిజానికి గతంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు–తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీలో కూడా ఇదే అంశం ప్రస్తావనకు వచ్చింది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సులకు గతంలో మాదిరిగానే ప్రాధాన్యం ఇవ్వాలని, తిరుమలపై స్థలం ఇస్తే తాము వసతిగృహం నిర్మించి, తెలంగాణ భక్తులకు ఇస్తామని బాబును కోరారు. కానీ బాబు ఆయనకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. ఎందుకంటే తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖను ఆమోదిస్తే, కర్నాటక, మహారాష్ట్ర, చెన్నై ప్రజాప్రతినిధుల లేఖలనూ ఆమోదించాల్సి ఉంటుంది. ఇప్పటికే వీఐపీల దర్శనాల వల్ల, సామాన్య భక్తులు ఇబ్బంది పడుతున్నారన్న విమ ర్శలు వస్తున్నాయి. ఈ కారణంతోనే ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధుల లేఖలు ఆమోదించడం లేదంటున్నారు. అయితే ఆయా రాష్ట్రాల ఎమ్మెల్యేలు వచ్చినప్పుడు మాత్రం, మిగతా.. 2లో

## పేదల భూ హక్కులను కాపాడేందుకే

# భూ భారతి-2024

- ధరణి పోర్టల్ కేసీఆర్ సొంతంగా కనిపెట్టింది కాదు
- ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న వారిలో ఎవరూ ఈ దేశానికి చెందిన వ్యక్తులు కాదు
- అలాంటి వ్యక్తుల చేతుల్లోకి తెలంగాణ రైతుల భూముల వివరాలు పెట్టారు
- కేసీఆర్, కేటీఆర్ ఇతర దేశాల వ్యక్తులకు ఈ సమాచారం అప్పగించారు
- అర్ధరాత్రి రిజిస్ట్రేషన్ లు చేసే వ్యవస్థ ఏ రాష్ట్రంలోనైనా ఉందా?
- ధరణి అద్భుతమైతే సభలో ఉండి మమ్మల్ని నిలదీయాలి కదా?
- ఈ కార్ రేస్ సంస్థకు చెందిన వ్యక్తి అపాయింట్ మెంట్ అడిగితే నేనే ఇచ్చా
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్: అర్హులైన ప్రతి భూ యజమానులు హక్కులు కాపాడేందుకు చట్టాన్ని సభలో ప్రవేశపెట్టాం. చర్చ జరగడం ద్వారా తెలంగాణ రైతులకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకురావాలని భావించాం. ప్రతిపక్ష పార్టీ అహంభావం, అహంకారంతో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించింది. సహనం కోల్పోయేలా రెచ్చగొట్టి చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినా మీరు ఆ అవకాశం వారికి ఇవ్వలేదు. ఓపిక నశించి వాళ్లే వెళ్లిపోయినా చర్చకు అవకాశం కల్పించిన మీకు అభినందనలు. రావి నారాయణ రెడ్డి, అరుట్ల కమలాదేవి, అరుట్ల రాంచంద్రా రెడ్డి, మిగతా.. 7లో



03 ఏపీలో ప్రతిష్ఠాత్మక ఇన్నొవేషన్ యూనివర్సిటీ



03 ఓర్వకల్లులో రూ.14వేల కోట్ల పెట్టుబడులు




04 ప్రజల జీవితాలతో చెలగాటమాడి... జేబులు నింపుకొన్న వైసీపీ సర్కారు!

## వేగంగా ధాన్యం

# సేకరణ

- గత ప్రభుత్వం కన్నా రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు
- గత ఏడాది ఇదే సమయానికి 12.55 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే.. ఈ ఏడాది 21.04 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోళ్లు
- గత ప్రభుత్వంలో కొన్న ధాన్యానికి డబ్బులివ్వకుండా రైతులకు వేధింపులు
- 93 శాతం మంది రైతులకు 24 గంటల్లోనే డబ్బులు జమ
- త్వరలో అందుబాటులోకి సైలోస్ సిస్టమ్
- ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు
- రైతులకు నచ్చిన మిల్లులో ధాన్యాన్ని అమ్ముకోవచ్చు
- గంగూరు మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు






పెనమలూరు/గంగూరు: 'రాష్ట్రంలో ధాన్యం సేకరణ చాలా వేగంగా జరుగుతోంది. రైతుల నుండి సకాలంలో పౌరసరఫరా శాఖ అధికారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇదే సమయానికి 12.55 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే...నేడు మా ప్రభుత్వంలో ఇప్పటికే 21,04,233 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. రాష్ట్రంలో 3,20,703 మంది రైతుల నుంచి ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేశాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

పెనమలూరు నియోజకవర్గం, గంగూరులో రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. రైస్ మిల్లులను తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... "గత ప్రభుత్వం రైతుల నుంచి మిగతా.. 2లో



06 తప్పుడు డాక్యుమెంట్లతో భూమి కబ్జా!



08 3 దశల్లో మన్యం రోడ్ల అభివృద్ధి



08 పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

# తెలంగాణ అసెంబ్లీ రణరంగం

- ఒకరిపై ఒకరు వాటర్ బాటిల్స్, పేపర్లు విసురుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పు చూపించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆగ్రహం
- స్పీకర్ పోడియం మెట్లపైకి హరీష్‌రావు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్లకార్డుల ప్రదర్శన, నినాదాలు



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ఆరో రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. వాయిదా తీర్మానంపై బీఆర్ఎస్ నేతలు చర్చకు పట్టుపట్టారు. ఈ ఫార్ములా కార్ రేసింగ్‌పై చర్చ కోసం బీఆర్ఎస్ నేతలు వాయిదా తీర్మానం ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారంటూ నల్ల బ్యాడ్జీలతో మండలికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వచ్చారు.

సభలో ఫార్ములా– ఈ అంశంపైన వెంటనే సభలో చర్చకు బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డ్‌లతో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. 420కాంగ్రెస్ ఇచ్చిన బూటకపు హామీలను ప్రశ్నించినందుకే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. ఫార్ములా– ఈ పైన కేసు అక్రమం అంటూ ప్లకార్డుల ప్రదర్శన, నినాదాలు చేశారు. దీంతో అసెంబ్లీ రణరంగంగా మారింది.

సభలో తమకు కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పు చూపించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. దళిత ఎమ్మెల్యేలకు చెప్పు చూపించారని మండిపడ్డారు. షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. దీంతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. స్పీకర్ పోడియం వైపు బీఆర్ఎస్ సభ్యులు దూసుకెళ్లారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు వాటర్ బాటిల్స్, పేపర్లు విసురుకున్నారు. ఒక్కసారిగా సభలో గందరగోళం నెలకొంది. దాంతో సభను 15 నిమిషాల పాటు అసెంబ్లీ స్పీకర్ వాయిదా వేశారు. మిగతా.. 2లో

# కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

- వారం రోజుల వరకూ అరెస్ట్ చేయవద్దని ఆదేశం
- ఏసీబీ విచారణకు సహకరించాలని కేటీఆర్‌కు ఆదేశాలు
- ఫార్ములా ఈ-కార్ రేసు



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. వారం రోజుల వరకూ వరకు కేటీఆర్‌ను మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 21, డిసెంబర్ 2024 ||


స్కేటింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రధానమత్రి బాలపురస్కార్ 2025 అవార్డును అందుకున్న జెస్సీరాజ్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నాను. అంకితభావం, పట్టుదలతో ఈ ప్రతిష్ఠాత్మకు అవార్డును జెస్సీరాజ్ కైవసం చేసుకున్నందుకు గర్వపడుతున్నాను. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను. ఆమె చేస్తున్న కృషికి నిరంతరం మద్దతుగా నిలుస్తాం. జెస్సీరాజ్ మరిన్ని విజయాలను సాధించేందుకు అన్నివిధాల సహాయ, సహకారం అందిస్తామని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



## తెలంగాణ అసెంబ్లీ రణరంగం

**మొదటి పేజీ తరువాయి..**

స్పీకర్‌పై బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేపర్ల కట్ట విసిరారని కాంగ్రెస్ సభ్యులు అంటున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కూడా పేపర్లు చింపి విసిరేశారు. స్పీకర్ పోడియం మెట్లపైకి హరీష్‌రావు వెళ్లారు. పాడి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేల వైపుకు దూసుకురావడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేయి చూపించి హెచ్చరించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దళిత స్పీకర్‌ను అవమానించేలా సభలో వ్యవహరించారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అంటున్నారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. సభలో ఒక్క మంత్రి కూడా ఎందుకు లేరని ప్రశ్నించారు. అసెంబ్లీ అంటే మంత్రులకు ఎంత గౌరవం ఉందో అర్థం అవుతుందని అన్నారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్‌పై చర్చకు స్పష్టమైన హామీ ఇస్తేనే తాము సభ సాఫీగా జరగడానికి సహకరిస్తామని అన్నారు. ఒక సభ్యునిపై కేసు పెట్టారని.. సభ నడుస్తున్నప్పుడు ఆ సభ్యునికి వాస్తవం చెప్పుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. కేటీఆర్‌పై పెట్టింది ముమ్మాటికీ అక్రమ కేసే అని హరీష్‌రావు అన్నారు.

హరీష్‌రావు వ్యాఖ్యలపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడారు. కొందరు మంత్రులు శాసనమండలిలో ఉన్నారని చెప్పారు. భూభారతి బిల్లుపై చర్చ పూర్తి కానివ్వాలని అన్నారు. బిల్లుపై చర్చ పూర్తయిన తర్వాత సభ్యులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఒక సభ్యుని కోసం సభా సమయాన్ని వృథా చేయడం సరికాదని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు. ఈ కార్ రేసింగ్ శాసనసభలో చర్చించే అంశమే కాదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గవర్నర్ ఆమోదం తెలిపి ఏసీబీ కేసు కూడా నమోదు చేసిందని గుర్తు చేశారు.

## కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

**మొదటి పేజీ తరువాయి..**

అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 30 లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఏసీబీ విచారణకు సహకరించాలని కేటీఆర్ ను హైకోర్టు ఆదేశించింది. ఏసీబీ తన దర్యాప్తును కొనసాగించవచ్చని తెలిపింది. తదుపరి విచారణ ఈనెల 27కి వాయిదా వేస్తూ తీర్పు వెలువరించింది.

ఫార్ములా ఈ-కార్ రేసింగ్ లో తనపై నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని కోరుతూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది సుందరం, ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో ఏబీసీ తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్.. హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం ఇరువర్గాల వాదనలు వినింది.

కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సుందరం, తెలంగాణ ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంలో కేటీఆర్ ఎక్కడా లబ్ధి పొందలేదని న్యాయస్థానానికి సుందరం తెలిపారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఏసీబీ కేసు నమోదు చేసిందని, ఏసీబీ నమోదు చేసిన సెక్షన్లు కేటీఆర్‌కు వర్తించవని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి, అసలు ఆధారాలే లేవని చెప్పారు. కేటీఆర్ లబ్ధి చేకూరినట్లు ఎక్కడా నిరూపితం కాలేదని చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం కేటీఆర్‌ను వారం రోజుల వరకూ అరెస్టు చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది.

ఒక ప్రైవేట్ సంస్థకు లబ్ధి చేకూర్చినట్టు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారని, కానీ సదరు ప్రైవేట్ సంస్థను నిందితుల జాబితాలో చేర్చలేదని కేటీఆర్ పిటిషన్ లో తెలిపారు. 2023 అక్టోబర్ 30న చేసుకున్న అగ్రిమెంట్ ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు రాదని చెప్పారు. అగ్రిమెంట్ కు ముందు నిధులు పంపడం ఎఫ్ఈఓ ఉల్లంఘన కాదని తెలిపారు. ముందుగా చేసుకున్న అగ్రిమెంట్ కు ఇది కొనసాగింపు మాత్రమేనని చెప్పారు.

అగ్రిమెంట్ ద్వారా తాను వ్యక్తిగతంగా లాభపడినట్టు ఎఫ్ఐఆర్ లో పేర్కొనలేదని కేటీఆర్ తెలిపారు. ప్రతిపక్ష పార్టీ నేతల అరెస్ట్ లు ఉంటాయని ఒక మంత్రి బహిరంగంగానే మాట్లాడారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీ నేతలను టార్గెట్ చేసి, ఏదో ఒక కేసు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని పిటిషన్ లో పేర్కొన్నారు.






# సెంటు భూమి కబ్జా చేసినా ఖబడ్దార్

**మొదటి పేజీ తరువాయి..**

ప్రాణంతో సమానమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సర్వస్వంగా భావించే భూమిని గత ప్రభుత్వంలో అడ్డగోలుగా లాక్కున్నారని అన్నారు. భూమికి, మనకు ఉన్న బంధాన్ని తెంచేయాలని చూశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారు. ఈ యాక్ట్‌తో ఆనాటి ముఖ్యమంత్రి గుమస్తాలను పెట్టుకొని మీ భూమిపై పెత్తనం చేసే పరిస్థితికి వచ్చారన్నారు. వారసత్వంగా వచ్చిన లేదా కష్టపడి



భూమిని కొనుక్కొంటే దానిపైన ఆయన బొమ్మ వేసుకున్నారు.

రాజముద్ర ఉండాల్సిన చోట ఆయన సొంత బొమ్మ వేసుకున్నారు. మనదగ్గర బ్రిటిష్ కాలం నుంచి చాలా పటిష్టంగా రికార్డులు ఉన్నాయి. నిజాం పాలనతో పాటు కొందరు హైదరాబాద్ నుంచి పాకిస్తాన్ వెళ్లిపోవడం వంటి కారణాల వల్ల తెలంగాణలో రికార్డులకు సంబంధించి కొన్ని సమస్యలు ఉంటాయి. కానీ.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బ్రిటిష్‌వారు చాలా పకడ్బందీ రికార్డులను నిర్వహించారు.



జమాబందీలో మనం డబ్బులుకట్టి మన భూమి మన పేరుతో ఉందో లేదో ఏటా చూసుకునేవాళ్లం. అలాంటి మంచి వ్యవస్థ ఉన్న స్థితి నుంచి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మన భూమి మనకు లేకుండా చేసే స్థితికి తీసుకొచ్చారు. అందుకే చెప్పిన మాట ప్రకారం మొదటి క్యాబినెట్ సమావేశంలోనే చర్చించి ఆ చట్టాన్ని రద్దు చేశామని ముఖ్యమంత్రి వివరించారు.

### రాళ్లపై ఉన్న ఫొటో తీయడానికి రూ. 12 కోట్లు అయింది

భూముల సర్వే పేరుతో విధ్వంసం సృష్టించి.. రాళ్లపై ఫొటోలు వేసుకున్నారని.. ఆ బొమ్మలు తీయడానికి రూ. 12 కోట్లు అయిందని ముఖ్యమంత్రి వివరించారు. మొన్నటివరకు మీరు భయంభయంగా బతికారని.. భూమిని కబ్జా చేసినా, 22ఏలో పెట్టినా, భూమి మీది కాదని చెప్పినా మాట్లాడాలంటే భయపడే పరిస్థితికి వచ్చారు. కానీ.. ఇప్పుడు మీరు స్వేచ్ఛగా ఇక్కడికి వచ్చి, నేరుగా అడిగే అధికారం ఎన్‌డీఏ ప్రభుత్వం మీకు ఇచ్చింది.

దాదాపు అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెడుతున్నాం. ఈ సదస్సుల ద్వారా 95,263 పిటిషన్లు వచ్చాయి. డిసెంబర్ 6న ప్రారంభించి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు పెడుతున్నాం. దాదాపు 3 లక్షల మంది ఈ సదస్సులకు హాజరయ్యారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించి మీ భూమి మీకు ఇచ్చే బాధ్యత మాది. ఇందులో ఎలాంటి అనుమానం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### అత్యంత పారదర్శకంగా సమస్యల పరిష్కారం

ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్-2024 చట్టం తీసుకొచ్చామని.. ఎవరైనా వేరేవాళ్ల భూమిని కబ్జాచేస్తే అలాంటి వారిపై చాలా కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎవరైనా మోసం చేసి భూమిని లాక్కున్నా, బలవంతంగా బెదిరించి లాక్కున్నా కొత్త చట్టం వర్తిస్తుందని, జైల్లో పెట్టే అధికారం ఇచ్చాం. ఎవరైనా ఒకసారి తప్పుచేస్తే పీడీ యాక్టు కింద జైలుకు పంపించే హక్కును చట్టం కింద తీసుకొచ్చాం. మరోవైపు ఎక్కడ భూకబ్జా జరిగినా.. భూకబ్జాకు పాల్పడినా వారిని జైల్లో పెట్టడమే కాకుండా భూమి విలువ మేరకు జరిమానా కూడా వేస్తున్నాం. ఎవరైనా ఒక సెంటు భూమి కబ్జా చేసినా ఖబడ్దార్.. తాటతీస్తాం. ఎవరినీ వదిలిపెట్టం. ఎవరైనా వేరేవారి భూమిపై కన్నేస్తే జైలు కనిపించాలి.

దాదాపు 16,816 గ్రామాలకుగాను 6,698 గ్రామాల్లో రీసర్వే చేశారు. అయితే ఈ రీసర్వేకి సంబంధించి తప్పుడు సర్వే జరిగిందంటూ దాదాపు 2,79,148 మంది ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తాం. 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులు జరుగుతాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత మనం తీసుకోవాలి. నా దగ్గరికి ఒక్క పిటిషన్ కూడా రాని రోజున సమర్థవంతంగా పని చేసినట్టు లెక్క అని అన్నారు.


ఒకవేళ నా దగ్గరికి ఒక పిటిషన్ వచ్చినా.. అది పరిష్కారం చేయలేని సమస్య అయి ఉండాలన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రతి గ్రామంలో రెవెన్యూ మ్యాపు, ప్రభుత్వ, ప్రైవేటు భూముల న్నింటినీ ప్రదర్శిస్తున్నాం. అభ్యంతరాలుంటే చెప్పమంటున్నాం.

ఎస్ఎల్ఆర్, ఆర్ఆర్, 1బీ రిజిస్టర్, 22ఏ జాబితా అన్నింటినీ పారదర్శకంగా పెడుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు. భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో మార్పులు, వారసుల పేర్ల నమోదు, సరిహద్దు సమస్యలు, భూ విస్తీర్ణంలో తేడాలు, రీసర్వేలో రికార్డు అయిన తప్పులు, భూకబ్జాలు, అసైన్డ్ భూముల పరాధీనం, నిషిద్ధ భూములు, 22ఏ నుంచి తొలగింపు.. వీటన్నింటినీ పరిశీలిస్తాం. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం. ఒకసారి రికార్డు అప్‌డేట్ అయిన తర్వాత పట్టాదారు పాస్ పుస్తకాలిస్తాం. క్యూఆర్ కోడ్ కూడా పెట్టి, జియో ట్యాగింగ్ కూడా చేస్తామని వివరించారు. ఎప్పటికప్పుడు రికార్డులను పరిశీలించుకునే అవకాశం లభిస్తుందన్నారు. నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకొని అన్నింటినీ పూర్తిచేస్తామని తెలిపారు.

### మీ ఇంటి జాగా మీకిచ్చే బాధ్యత మాది

ఇక్కడ గ్రామంలో బీసీ కాలనీ.. అతిపెద్ద సమస్య.. 176 ఇంటి జాగాలు.. ఎన్‌టీఆర్ గారి హయాంలో ఇచ్చాం. ఈరోజు ఈ జాగాలను 22ఏకి ఎక్కించి ఇది మీ భూమి కాదు.. ప్రభుత్వ భూమి అని చెప్పి ఇబ్బందిపెట్టే పరిస్థితికి వచ్చారు. మీ అందరికీ ఒకటే హామీ ఇస్తున్నాం.. మీకు భేషరతుగా పట్టాలు ఇచ్చే బాధ్యత మేము తీసుకుంటామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

22ఏ జాబితాకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చట్టపరంగా పరిశీలించి చేసి వారిపట్టాలు వారికిచ్చేలా చేస్తాం. ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనేది తన ఆలోచన అని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా కల్పించారు.





# నాయుడు చెప్పారు.. సీఎంఓ వద్దంది?!

మొదటి పేజీ తరువాయి..

వారికి ప్రొటోకాల్ దర్శనం ఇస్తున్నామని టీటీడీ అధికారులు చెబుతున్నారు.

తర్వాత బీఆర్ నాయుడు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. మాజీ మంత్రి హరీష్‌రావును, మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లారు. ఆ సందర్భంలో హరీష్‌రావు కూడా, తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సులు ఆమోదించాలని నాయుడును కోరారు. ఆ తర్వాత టీటీడీ ఈఓ శ్యామలరావు నిర్వహించిన 'డయల్ యువర్' ఈఓ కార్యక్రమంలో, తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను ఆమోదించలేమని స్పష్టం చేశారు.

ఆ తర్వాత తిరుమల దర్శనానికి వెళ్లిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సైతం.. తెలంగాణ ప్రజాపతినిధుల లేఖలను ఆమోదించకపోతే, తాము తెలంగాణ అసెంబ్లీలో కీలమైన నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని హెచ్చరించారు. "ఆంధ్రా వాళ్లు తెలంగాణలో వ్యాపారాలు చేసుకుంటుంటే మేం ఎప్పుడైనా అడ్డుకున్నామా? మా ప్రాంతంలోని యాదాద్రి, భద్రాచలం, వేములవాడ ఆలయాలకు ఆంధ్రా ఎమ్మెల్యేల లేఖలను ఆమోదిస్తున్నప్పుడు, మీరు టీటీడీకి మేం ఇచ్చే లేఖలను ఎందుకు ఆమోదించరు" అంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

ఈ క్రమంలో యాదగిరిగుట్టకు వెళ్లిన ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్..ఈ విషయంలో ప్రదర్శించిన అత్యుత్సాహం విమర్శలకు దారితీసింది. తాను సీఎంతో టీటీడీకి తెలంగాణ ఎమ్మెల్యేల లేఖల ఆమోదంపై చర్చిస్తానని హామీ ఇవ్వడం విమర్శలకు దారితీసింది. ఓ వైపు టీటీడీ ఈఓ స్వయంగా తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను ఆమోదించమని స్పష్టం చేస్తే, ఆ శాఖతో ఎలాంటి సంబంధం లేని కార్మిక మంత్రి.. తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలపై ఎలా హామీ ఇస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు.

తాజాగా మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ చేసిన వ్యాఖ్యలపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రంగా స్పందించారు. మాజీమంత్రి శ్రీనివాసగౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ మేరకు ఆయన చేసిన ట్వీట్ చర్చనీయాంశమయింది. "తిరుమల ప్రశాంతతను దెబ్బతీసేలా తిరుమల కొండపై ఎవరు రాజకీయ వ్యాఖ్యలు చేసినా సహించేది లేదు. తిరుమల పవిత్ర క్షేత్రమే తప్ప, రాజకీయ వేదిక కాదు. తిరుమలను ఎవరు రాజకీయంగా వేదిక చేసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవని గతంలో స్పష్టం చేశాం. తిరుమల పవిత్రతు కాపాడేందుకే మేం తొలి సమావేశంలోనే ఆమేరకు బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకున్నాం. కొండపై రాజకీయంగా విమర్శలు చేసేవారు ఎంతపెద్దవారైనా విడిచిపెట్టం. తెలంగాణకు చెందిన ఒక నేత తిరుమల వేదికగా రాజకీయ విమర్శలు తీవ్రంగా పరిగణించి అతనిపై చర్యలకు ఆదేశిస్తున్నాం"అని స్పష్టం చేశారు.

అంతవరకూ బాగానే ఉంది. తిరుమలపై రాజకీయ వ్యాఖ్యలు, రాజకీయ విమర్శలు చేయకుండా నిషేధించిన ఘనత ఈ పాలకవర్గానిదే. అందువల్ల తాము రూపొందించిన నిబంధ నలు అమలుచేసేందుకు, చైర్మన్ నాయుడు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించడం స్వాగతించదగ్గ పరిణామమే. అయితే..చైర్మన్ నాయుడు మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్‌పై చర్యలకు ఆదేశించిన తర్వాత, ఏపీ సీఎంఓలోని ఒక కీలక అధికారి రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. చైర్మన్ ఇచ్చిన ఆదేశాలు అమలుచేయవద్దని, ఇది రెండు రాష్ట్రాల మధ్య భావోద్వేగాలు, విద్వేషాలు, రాజకీయ వైరానికి కారణమవుతుందని హితోపదేశం చేసినట్లు సమాచారం. ఆ మేరకు సోషల్‌మీడియాలో కూడా చర్చకు తెరలేచింది.

బహుశా ఈ అంశం తెలంగాణలో బీఆర్ఎస్‌కు.. రాజకీయ అస్త్రంగా మారే ప్రమాదం ఉన్నందున, కేసు విషయంలో ముందుకు వెళ్లవద్దన్న ఆదేశాలు ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఇప్పటికే సచివాలయం పక్కన ఉన్న ఎన్టీఆర్ ఘాట్‌ను కూల్చివేసి, దాని స్థానంలో అసెంబ్లీ నిర్మించాలన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు వివాదం సృష్టిస్తున్నాయి. మళ్లీ ఇప్పుడు టీటీడీ సిఫార్సు లేఖల వ్యవహారం మాట్లాడిన, బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్‌పై కేసు పెడితే.. అది మళ్లీ ప్రాంతీయ రాజకీయాలకు ఆజ్యం పోసి, బీఆర్ఎస్‌కు రాజకీయంగా లాభం కలిగిస్తుందన్న అంచనా కూడా సీఎంఓ నిర్ణయంలో లేకపోలేదు.

కాబట్టి.. చైర్మన్ నాయుడు ఆదేశాలు అమలయ్యే అవకాశాలు లేవని అర్థమవుతుంది.

ఈ నెల 24న జరిగే టీటీడీ బోర్డు సమావేశంలో సభ్యులెవరైనా ఈ అంశాన్ని ప్రస్తావిస్తే, ఈఓ ఏం సమాధానం ఇస్తారో చూడాలి. సీఎంఓ నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చాయన్నది, ఈఓ బోర్డు సభ్యులను వివరించి తీరాల్సిందే. ఒకవేళ అలాంటి ఆదేశాలు రాకపోతే, బోర్డు నిర్ణయం ప్రకారం శ్రీనివాస గౌడ్‌పై ఎందుకు కేసు నమోదు చేయలేదన్నదీ వివరిం చాల్సిందే.

అయితే ఇప్పుడు రాజకీయ అంశాలు ప్రస్తావించిన శ్రీనివాస గౌడ్‌పై చర్యలు తీసుకోకుండా వదిలేస్తే.. రేపు వైసీపీ నేత, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, రోజా వంటి వారు సైతం తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేస్తే, వారిపై కేసులు పెట్టే అవకాశం ఉండదు కదా? అని టీటీడీ బోర్డు సభ్యుడొకరు వ్యాఖ్యానించారు. మరి అప్పుడు తిరుమలపై రాజకీయ వ్యాఖ్యలు చేస్తే, కేసు పెడతామన్న తీర్మానం వల్ల ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు.



## కొండపై మీడియా ఎందుకు?

అయితే.. ఇన్ని వివాదాలకు కారణమవుతున్న తిరుమలపై.. అసలు మీడియాను ఎందుకు నిషేధించరన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. 'కొండపై మీడియాతో మాట్లాడే వెసులుబాటు కల్పించడం వల్లే కదా రాజకీయనేతలు వచ్చి మీడియాతో మాట్లాడగలుగుతుంది? అదే అసలు కొండపై మీడియాను నిషేధిస్తే, అప్పుడు వీఐపీలు మాట్లాడే అవకాశమే ఉండదు కదా? భక్తులు వచ్చి దర్శనం చేసుకుని వెళ్లేప్పుడు మీడియా ఎందుకు? అయోధ్య, రామేశ్వరం, శబరిమల, బద్రీనాథ్, హంపి, శృంగేరి వంటి ఆలయాల్లో మీడియా లేనప్పుడు తిరుమలపై ఎందుకు" అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

బహుశా చైర్మన్ నాయుడు, స్వయంగా ఒక పెద్ద టీవీ చానెల్ అధిపతి అయినందున.. కొండపై మీడియా నిషేధంపై నిర్ణయం తీసుకునేందుకు వెనకాడుతున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పైగా కొండపై పెద్ద మీడియా సంస్థలు, తమిళనాడుకు చెందిన మీడియా ప్రతినిధుల్లో చాలామందికి షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్నాయన్న విమర్శలు లేకపోలేదు. వాటి ఆదాయంతో తిరుపతిలో సెల్‌ఫోన్ డీలర్‌షిప్పులు, భవనాలు నిర్మించే స్థాయికి ఎదిగారంటున్నారు. కేవలం తమ యాజమాన్యాలకు తిరుమల దర్శనాలు చేయించేందుకే తప్ప, కొండపై మీడియా చేసేదేమీ లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

'ఇక్కడి నుంచి బోర్డులో నియమితులమైన మాపై తెలంగాణలో ఎమ్మెల్యేల లెటర్లు తీసుకోవాలన్న ఒత్తిడి ఉంది. కానీ అది ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయం. మా చైర్మన్ గారి ఆదేశాల ప్రకారం శ్రీనివాస్ గౌడ్‌పై ఏం చర్యలు తీసుకున్నారో మేం రేపు బోర్డు మీటింగులో అడుగుతాం. బోర్డు ఒక తీర్మానం చేస్తే దానిని ఈఓ, అధికారులు అమలుచేయాల్సిందే. మరి లేకపోతే మేం బోర్డులో ఉన్నది ఎందుకు" అని తెలంగాణకు చెందిన ఓ బోర్డు సభ్యులు ప్రశ్నించారు.

కాగా టీటీడీ చైర్మన్‌కు స్వేచ్ఛ ఇస్తే తెలంగాణకు న్యాయం జరుగుతుందన్న మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మాజీ మంత్రి వ్యాఖ్యల ప్రకారం.. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల ఆమోదం విషయంలో చైర్మన్‌కు స్వేచ్ఛ లేదని చెప్పకనే చెప్పినట్లయింది.

డిజిటల్ న్యూస్ పేపర్

శనివారం 21, డిసెంబర్ 2024

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

## డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,85,450

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1 న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్

మార్తి సుబ్రమణ్యం

సంపాదక సారథ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)

సారథ్యంలో



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 21, డిసెంబర్ 2024








కుప్పంలో రెండో రోజు పర్యటనలో భాగంగా గుండ్లమడుగు గ్రామస్థులు నారా భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా పూలు పరిచి అభిమానాన్ని చాటుకున్నారు. మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో భువనేశ్వరికొద్దిసేపు తమిళంలో ప్రసంగించారు.

# ఏపీలో ప్రతిష్ఠాత్మక ఇన్నొవేషన్ యూనివర్సిటీ

- ఫిజిక్స్ వాలాతో ఏపీ ప్రభుత్వం ఎంఓయు
- ఉన్నత విద్య ఆధునీకరణ కోసం టీబీఐతో ఒప్పందం
- యువతకు ప్రపంచస్థాయి అవకాశాలే ప్రధాన లక్ష్యం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో రెండు కీలక ఒప్పందాలు

**అమరావతి, మహానాడు:** అధునాతన సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఆవిర్భవిస్తున్న ఆంధ్రప్రదేశ్ లో డీప్-టెక్ ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు చేసుకుంది. ఫిజిక్స్ వాలా (పీడబ్ల్యు) ఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ లో ఏఐ-ఫోకస్డ్ ఫస్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ (ఎల్వోఈ)... యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్ (యూవోఐ)ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ (టీబీఐ)తో మరో ఒప్పందం చేసుకుంది.

ఉండవల్లి నివాసంలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఫిజిక్స్ వాలా, టోనీబ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వేర్వేరుగా ప్రభుత్వంతో ఎంఓయు చేసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్స్ ను ఏకీకృతం చేసే దిశగా పని చేస్తుంది. పరిశోధన, విద్య, ఉపాధిలో కీలక సవాళ్లను పరిష్కరించడంపై దృష్టిసారిస్తుంది. హబ్-అండ్-స్పోక్ మోడల్‌ను అనుసరించి ఇన్నొవేషన్ యూనివర్శిటీ సెంట్రల్ హబ్‌గా పనిచేస్తుంది. దీనిద్వారా విభిన్న నేపథ్యాలు, ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు సమకాలీన, హైబ్రిడ్ విద్యను యాక్సెస్ చేస్తారు. ఆన్‌లైన్, వ్యక్తిగత అభ్యసన అనుభవాలను ఇంటిగ్రేట్ చేస్తారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి పరిశ్రమ భాగస్వామితో ఫిజిక్స్ వాలా కలిసి పనిచేస్తుంది. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ వాలా ఫౌండర్, సిఇఓ అలఖ్ పాండే, కో ఫౌండర్ ప్రతీక్ బూబ్, పిడబ్ల్యు ఫౌండేషన్ హెడ్ విజయ్ శుక్లా, డైరక్టర్ సోన్ వీర్ సింగ్, హెడ్ ఆఫ్ ఇన్నొవేషన్స్ దినకర్ చౌదరి పాల్గొన్నారు.

### ప్రపంచస్థాయి ప్రమాణాలతో యువతకు శిక్షణ లక్ష్యం

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... కృత్రిమ మేధ (ఎఐ)లో ఎపి యువతను నెం.1గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా ఈ ఒప్పందాలు జరిగాయని అన్నారు. అధునాతన ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడం, అందుకు ఏపీ యువతను సన్నద్ధం చేయడమే తమ లక్ష్యమన్నారు. పరిశ్రమల డిమాండ్, ప్రమాణాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్ మెంట్ పై యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ దృష్టిసారిస్తుందని చెప్పారు. అధునాతన సాంకేతికత, విద్యను ఏకీకృతం చేయడానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ కృషిచేస్తుందని



చెప్పారు. టాలెంట్ డెవలప్ మెంట్, నాలెడ్జి క్రియేషన్ లో ఎపిని బలోపేతం చేయాలని ఫిజిక్స్ వాలాను కోరారు. ఏపీని ఏఐ హబ్ గా తీర్చిదిద్దేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని, ఇందుకోసం ఎఐలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక, నెక్స్ట్ జనరేషన్ నైపుణ్యాలకు మార్గం సుగమం చేస్తున్నామని మంత్రి లోకేష్ చెప్పారు.

### ఇన్నొవేషన్ వర్సిటీపై రూ.1000 కోట్ల పెట్టుబడులు

ఫిజిక్స్ వాలా (పీడబ్ల్యు) వ్యవస్థాపకుడు, సిఇఓ అలఖ్ పాండే మాట్లాడుతూ... ప్రభుత్వంతో మేం ఇప్పుడు కుదుర్చుకున్న ఒప్పందం ఎపిలో ఇన్నొవేషన్ విశ్వవిద్యాలయం స్థాపనలో తొలి అడుగు. ఇందుకు యుఎస్ జీఎస్వీ వెంచర్స్, ఇతర పెట్టుబడిదారుల ద్వారా ?1000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. అకడమిక్ లెర్నింగ్‌ని ఇండస్ట్రీతో మిళితం చేసే సంస్థను రూపొందించడానికి యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్ పనిచేస్తుందని పాండే అన్నారు.

ఫిజిక్స్ వాలా సహ వ్యవస్థాపకుడు ప్రతిక్ బూబ్ మాట్లాడుతూ... నిరంతరం అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్‌లో అభ్యాసకులకు అవసరమైన నైపుణ్యాలతో అందించడంలోయూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్ సహకరిస్తుందని చెప్పారు. చంద్రబాబునాయుడు అసమాన ఆలోచనల ఫలితంగానే యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ వంటి దార్శనిక ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని తెలిపారు. చురుకైన విధానాలు, నిర్ణయాత్మక నాయకత్వం పీడబ్ల్యుని ఆంధ్రా రావడానికి ఆకర్షించాయని చెప్పారు. జీఎస్వీ వెంచర్స్ మేనేజింగ్ పార్టనర్ డెబోరా క్వాజో మాట్లాడుతూ... విద్య, పరిశ్రమ మధ్య అంతరాన్ని తగ్గించే కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు తాం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం ద్వారా డీప్-టెక్, ఏఐ శక్తితో విద్యారంగంలో విస్తృత స్థాయి ఆవిష్కరణ కోసం ఒక నమూనాను సృష్టించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ స్థాపన ఎపి ప్రభుత్వ భాగస్వామ్య దృక్కోణాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు.

### ఉన్నత విద్య ఆధునీకరణకు టీబీఐతో ఒప్పందం

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్య వ్యవస్థను ఆధునీకరించేందుకు



టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ)తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకం చేసింది. ఈ కార్యక్రమంలో టీబీఐ కంట్రీ డైరక్టర్ వివేక్ అగర్వాల్, అసోసియేట్ ముంజులూరి రాగిణి రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఏపీ విద్యార్థులను తీర్చిదిద్దడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయంగా విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏపీ ఉన్నత విద్యలో చేయాల్సిన మార్పులపై టీబీఐ ప్రభుత్వానికి సలహా ఇస్తుంది. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించే విద్యా విధానాలను గుర్తిస్తుంది.

విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో తృతీయ విద్య ల్యాండ్ స్కేప్ ను మెరుగుపర్చడానికి కృషిచేస్తుంది. ఎపిలో సమగ్ర, స్థిరమైన ఆర్థికవృద్ధికి వేదిక ఏర్పాటుకు అవసరమైన ఆవిష్కణలను ప్రోత్సహిస్తుంది. ప్రస్తుత వ్యవస్థలో నైపుణ్య అంతరాలను గుర్తించి గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీస్ లను అమలుచేసేందుకు ఏపీ ప్రభుత్వంతో టీబీఐ కలిసి పనిచేస్తుంది. ఇందుకు అవసరమైన సమగ్ర రోడ్ మ్యాప్ ను అభివృద్ధి చేయడంలో సహకరిస్తుంది. టీబీఐ అనేది ప్రభావవంతమైన పరిష్కారాలను అందించడానికి ప్రముఖ నాయకులతో కలిసి పనిచేసేందుకు ఏర్పాటుచేసిన ప్రపంచ ప్రసిద్ధ సంస్థ. ప్రముఖ నాయకులు ప్రతిష్ఠాత్మకమైన ఆలోచనలను ప్రత్యక్ష ఫలితాలుగా మార్చడంలో టీబీఐ సహాయపడుతుంది.

నేతల ఆలోచనలకు అనుగుణంగా అర్థవంతమైన పురోగతిని అందించడానికి వీలు కల్పిస్తుంది. టీబీఐ ముఖ్యంగా అధునాతన సాంకేతికల కోసం స్ట్రాటజీ, పాలసీ, డెలివరీ విధానాలపై నిపుణుల సలహాలను అందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 40కిపైగా దేశాల్లో 800 మంది ప్రఖ్యాత రాజకీయ వ్యూహకర్తలు, పాలసీ నిపుణులు, డెలివరీ ప్రాక్టీషనర్లు, సాంకేతిక నిపుణుల బృందంతో టీబీఐ 100కి పైగా ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. ప్రజాజీవనాన్ని మెరుగుపర్చడమే లక్ష్యంగా, ప్రభుత్వాధినేతల ఆలోచనలకు అనుగుణంగా ఉత్తమ విధానాల రూపకల్పనకు టీబీఐ కృషిచేస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# ఓర్వకల్లులో రూ.14వేల కోట్ల పెట్టుబడులు

- మంత్రి టి.జి భరత్

**కర్నూలు, మహానాడు:** ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ. 14 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. సెమీ కండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్, ఇండియాకు చెందిన కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. అమరావతిలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కంపెనీ ప్రతినిధులు సమావేశమైనట్లు మంత్రి భరత్ తెలిపారు. రాయలసీమలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన ప్రాంతమని సమా వేశంలో పెట్టుబడిదారులతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. చర్చల అనంతరం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ.14వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ ప్రతినిధులు ముందు కొచ్చారన్నారు.



జనవరి రెండో వారంలో సీఎం చంద్రబాబు సమక్షంలో కంపెనీతో ఎంవోయూ చేసుకోనున్నట్టు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ దూరదృష్టితోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల పారిశ్రామిక అభివృద్ధిని పెంచడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు ఒక్కొక్కటిగా అడుగులు పడుతున్నాయన్నారు.

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రానున్న రోజుల్లో మరెన్నో పెట్టుబడులు వస్తాయన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇది సాధ్యమవుతుందని మంత్రి టి.జి భరత్ చెప్పారు. ఆవిష్కరణలు, పురోగతికి కేంద్రంగా కర్నూలు జిల్లా మారబోతుందని మంత్రి టి.జి భరత్ తెలిపారు.



# గ్రామంలో త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య

**జగ్గయ్యపేట:** రావిరాల గ్రామానికి కనుచూపుమేరలో నీళ్లు ఉన్నప్పటికీ త్రాగటానికి నోచుకోని గ్రామప్రజల కోసం శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామానికి మంచినీళ్లు ఇవ్వాలనే సంకల్పంతో RWS అధికారులు మరియు గ్రామస్తులతో కలిసి కృష్ణానది లోపల సరైన ప్రదేశం కోసం పరిశీలించి దానికి సంబంధించిన అంచనాలను తయారు చేసి ఇవ్వవలసిందిగా శాఖ వారిని ఆదేశించారు. రావిరాల గ్రామంతో పాటు జయంతిపురం, చిల్లకల్లు గ్రామాలకు కూడా దాన్ని విస్తరణ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయమని, అందుబాటులో ఉన్న నిధులతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మంజూరు చేయించి గ్రామాలకు నీటిని అందిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.



# రానున్న ఐదేళ్లల్లో 20 లక్షలమంది యువతకు ఉద్యోగ అవకాశాలు

- యువతకు బంగారు భవిష్యత్తు అందించేందుకు సీఎం కృషి
- ప్రతీ ఇంటిలోని యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలు ఆలోచించరు
- రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి

**ఏలూరు/నూజివీడు:** ప్రపంచస్థాయి సాంకేతికతను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు బంగారు భవిష్యత్తు అందించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడు ట్రిబుల్ ఐటీ లో శుక్రవారం 'మెగా జాబ్ మేళా' ను మంత్రి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. రానున్న 5 సంవత్సరాలలో రాష్ట్రంలోని 20 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, అంతేకాక ప్రతీ ఇంటి నుండి ఒక పారిశ్రామిక వేత్తను రూపొందించేలా ప్రత్యేక పారిశ్రామిక పాలసీని రూపొందిస్తున్నామన్నారు. పాపులేషన్ సెన్సస్ లాగా 'స్కిల్ సెన్సస్' నిర్వహించి ప్రతీ ఇంటిలో యువత ఏ అంశంలో నైపుణ్యం కలిగి ఉన్నది సెన్సస్ చేపడుతున్నామన్నారు.

అంతేకాక ప్రపంచస్థాయి సంస్థలు మన రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నామని, వారికి కావలసిన రంగంలో మన యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఆయా పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో స్కిల్ హబ్ లు ఏర్పాటుచేసి, యువతను అన్ని రంగాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

2047 స్వర్ణాంధ్ర కార్యాచరణ ప్రణాళికలో నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉద్యోగ కల్పన అంశానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని మంత్రి చెప్పారు. ఎన్టీపీసీ సంస్థ 1. 87 లక్షల కోట్ల రూపాయలతో సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి యూనిట్ స్థాపించనున్నదని, దీని ద్వారా 1. 06 లక్షల మంది యువత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యా శాఖామంత్రి నారా లోకేష్ ఇటీవల విదేశీ పర్యటనలో గూగుల్ సంస్థతో సంప్రతించి గూగుల్ సంస్థ తన యూనిట్‌ను రాష్ట్రంలో నెలకొల్పేలా చర్యలు తీసుకున్నారన్నారు. అదేవిధంగా వేల కోట్ల రూపాయలతో మన రాష్ట్రంలో తన యూనిట్‌ను నెలకొల్పేందుకు వచ్చిన మిట్టల్ స్టీల్ సంస్థ గత ప్రభుత్వ హయాంలో పరిస్థితులు అనుకూలించని కారణంగా ఒరిస్సాలో నెలకొల్పేందుకు ఆలోచిస్తుండగా, ముఖ్యమంత్రి చొరవతో తిరిగి మన రాష్ట్రంలో నెలకొల్పేందుకు అగ్రిమెంట్ కుదుర్చుకుందన్నారు. రిలయన్స్ సంస్థ 65 వేల కోట్ల రూపాయలతో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్లు నెలకొల్పేలా మంత్రి లోకేష్ చొరవ తీసుకున్నారన్నారు.

ఈ విధంగా ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలు, అదే స్థాయి టెక్నాలజీ తో తమ యూనిట్లను మన రాష్ట్రంలో నెలకొల్పి మన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ఈ విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నిలిపి, ప్రతీ ఇంటికి ఉద్యోగ అవకాశాలు, పారిశ్రామికవేత్తలను రూపొందిస్తే రాష్ట్రం అభివృద్ధి బాటలో నిలబడడంతో పాటు, ప్రజలు సంక్షేమ కార్యక్రమాల గురించి ఆలోచించరని మంత్రి చెప్పారు.

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 8 స్కిల్ హబ్స్‌లలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర కార్యాచరణ ప్రణాళికలో కూడా నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక స్థానం కల్పించామన్నారు. జిల్లాలో ఏ పరిశ్రమలలో ఏ ఏ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి , వాటికి ఏ ఏ విభాగంలో నైపుణ్యం అవసరం అని తెలుసుకుని వాటిల్లో యువతకు శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

జిల్లా కలెక్టర్ పనితీరును ప్రశంసించిన మంత్రి పార్థసారథి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పనిచేస్తున్నారని మంత్రి పార్థసారథి కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పేద ప్రజలకు అవగాహన కల్పించి వాటిని వారు సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు.

కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్, ట్రిబుల్ ఐటీ విసి అమరేంద్ర కుమార్, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరాజు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి జితేంద్ర కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు. అనంతరం జాబ్ మేళా కు దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి మరిన్ని హెల్ప్ డెస్క్ లు ఏర్పాటుచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.







కుప్పంలోని ప్రత్యంగిరా ఆలయంలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే అమ్మవారికి వెండి కిరీటం సమర్పించుకుంటామని భువనేశ్వరి మొక్కుకున్నారు. ఇప్పుడు అందరి సమక్షంలో మొక్కుని తీర్చుకున్నారు.








# ధనిక రాష్ట్రాన్ని దివాళా రాష్ట్రంగా మార్చేశాయి

- సంక్రాంతి తరువాత ఉద్యమాలను ఉద్ధృతం చేస్తాం.
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**ఢిల్లీ:** తెలంగాణ ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టిన పాపానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోయలేని అప్పుల భారాన్ని మోపాయి. బీఆర్ఎస్ గత పదేళ్ల పాలనలో రూ.6లక్షల 71వేల 756 కోట్ల అప్పు చేసినట్లు ప్రభుత్వమే ప్రకటించింది. ఇక కాంగ్రెస్ ఏడాది పాలనలో రూ.1లక్షా 27వేల కోట్లకు పైగా అప్పులు చేసినట్లు అసెంబ్లీ సాక్షిగా వెల్లడైంది. మొత్తంగా తెలంగాణ ప్రజల మీద ఈ రెండు పార్టీలు రూ.8 లక్షల కోట్ల అప్పు భారాన్ని మోపి, ధనిక రాష్ట్రాన్ని కాస్త దివాళా రాష్ట్రంగా మార్చేశాయి.

అప్పుల్లో కొట్టుమిట్టాడుతున్న తెలంగాణలో పన్నుల భారాన్ని మరింత పెరిగే అవకాశం ఉంది. పాత అప్పుల వడ్డీల కోసం ప్రభుత్వం కొత్త అప్పులు చేస్తోంది. పరిస్థితి ఇలానే కొనసాగితే తెలంగాణ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడే పరిస్థితి ఏర్పడేలా ఉంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే మేధావులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యమకారులతో పాటు తెలంగాణ శ్రేయస్సును కోరుకునే ప్రతి ఒక్కరు కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరును ఎండగట్టాలని బిజెపి పక్షాన కోరుతున్నాను. ఈ విషయంలో ప్రజల్లో చైతన్యం తేవడంతో పాటు రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ఉండేందుకు, రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి 6 గ్యారంటీలను అమలు చేయించేందుకు తెలంగాణ అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి తరువాత ఉద్యమాలను ఉద్ధృతం చేస్తాం.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 21, డిసెంబర్ 2024 ||





పాత మంగళగిరిలో విజయ్ డిజిటల్ షోరూమ్ నిర్వాహకులు నూతనంగా ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్స్ సూపర్ స్టోర్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు.



## ప్రజా అవసరాలు తీర్చేందుకే ప్రజాదర్బార్

- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి

**వై.రామవరం, మహానాడు:** ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం ఈ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కోరారు. వై.రామవరం మండలం, కోట గ్రామంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మఠం విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నీటి సమస్య, రోడ్ల సమస్య, కొన్ని చోట్ల డ్రైనేజీ వ్యవస్థలు కావాలని దరఖాస్తులను వచ్చాయన్నారు. వీటిని పరిష్కరించేందకు కృషి చేస్తానని తెలిపారు. కోట గ్రామంలో ప్రభుత్వ బాలుర పాఠశాలకు వెళ్లి పాఠశాల రికార్డులను, పాఠశాల పరిసరాలను పరిశీలించినట్టు తెలిపారు. కోట గ్రామ పంచాయతీ ప్రజలు, వై. రామవరం పార్టీ మండల అధ్యక్షుడు పల్లాల రమణా రెడ్డి, మఠం శేఖర్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఆర్. పుష్ప రాజు, వాట్సన్, చిన్నారావు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






2వ రోజు పర్యటనలో భాగంగా కుప్పంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన నారా భువనేశ్వరి, సమస్యల పరిష్కారానికి హామీ.







ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఛత్తీస్‌ఘడ్ పీసీసీ అధ్యక్షులు దీపక్ కుమార్ బైజ్. పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.

## ఎన్నికల్లో అంబేద్కర్‌ను ఓడించిన కాంగ్రెస్ పరాన్నజీవి!

- ఏపీలో కూడా కొత్త పిచ్చగాళ్ళు తయారయ్యారు
- మండిపడ్డ మంత్రి సత్యకుమార్

**విజయవాడ, మహానాడు:** అంబేద్కర్ ని అవమానించి శుద్ధులు చెబుతారా అంటూ కాంగ్రెస్ పై భారతీయ జనతా పార్టీ(బీజేపీ) నేత, మంత్రి సత్య కుమార్ ఫైర్ అయ్యారు. నెహ్రూ అంబేద్కర్ ని అవమానించే కార్టూన్ ఆనాటి పుస్తకాల్లో ప్రచురించిన ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఈ మేరకు మంత్రి విలేఖర్లతో మాట్లాడారు. కార్టూన్ ను మీడియాకు చూపిస్తూ కాంగ్రెస్ అంబేద్కర్ ని అవమానించిన అన్ని సంఘటనలు వివరిస్తూ కాంగ్రెస్ పరాన్న జీవిగా మారిందని విమర్శించారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే... పార్లమెంట్ సమావేశాలలో భాగంగా జరుగుతున్న పరిణామాలు దేశవ్యాప్తంగా గమనిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజ్యాంగ బద్ధంగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయి.

ప్రతిపక్షాలు పార్లమెంట్ లో సమయాన్ని వృథా చేస్తున్నాయి. కాంగ్రెస్ కు ఉన్నట్టుండి రాజ్యాంగం మీద, అంబేద్కర్ మీద ప్రేమ పుట్టుకొచ్చింది. రాజ్యాంగం లో 24వ సవరణ తీసుకొచ్చి ప్రజలకున్న ప్రాథమిక హక్కులు హరించే విధంగా కాంగ్రెస్ పాలన చేసింది.

44వ సవరణ చేసి పార్లమెంట్ ని సుప్రీమ్ కోర్టు పరిధిలో నుంచి బయటకి తీసుకొచ్చారు. రాజ్యాంగాన్ని అనేకసార్లు భ్రష్టు పట్టించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ని చాలా సార్లు అవమానించింది. రాజ్యాంగం రచించేటప్పుడు అంబేద్కర్ ని అవమానపరిచేలా కాంగ్రెస్ పార్టీ కార్టూన్స్‌ని విడుదల చేశారు.




అంబేద్కర్ ని నెహ్రూ అనేక విధాలుగా అగౌరపరిచారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ని ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడించింది. అంబేద్కర్ పోటీ చేసినప్పుడు బీజేపీ అభ్యర్థిని పోటీకి దించకుండా ఆయన్ని గౌరవించిన పార్టీ బీజేపీ. అంబేద్కర్ స్మారకాన్ని నిర్మించటానికి నెహ్రూ అడ్డుపడ్డారు. అంబేద్కర్ సేవలకు భారత రత్న ఇవ్వకుండా నెహ్రూ కి మాత్రం ప్రకటించుకున్నారు.

అంబేద్కర్ సేవలు గుర్తించి భారతరత్న ఇచ్చి గౌరవించింది బీజేపీ.

అంబేద్కర్ నడయాడిన ఐదు ప్రదేశాలలో పంచ తీర్థ కార్యక్రమం తో బీజేపీ శ్రీకారం చుట్టింది. ఏపీలో కూడా కొత్త పిచ్చగాళ్ళు తయారయ్యారు. పలు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయ్యింది. అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ మనుగడ కోల్పోతుంది. కాంగ్రెస్ తప్పు తెలుసుకుని అసత్య ప్రచారాలు చేయటం మానుకుంటే మంచిది. జమిలి ఎన్నికలు ఈ దేశానికి కొత్త కాదు. గతంలో చూసుకుంటే దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగాయి. జగన్ 2027లో జమిలి ఎన్నికలు వస్తాయని అని చెప్పి పార్టీ నాయకులని కాపాడుకుంటున్నారు. పార్టీలో నుంచి ముఖ్యమైన నాయకులు బయటకి వెళ్లిపోతున్నారని వారిని కాపాడుకునేందుకు జగన్ 2027లో జమిలి వస్తాయని చెప్తున్నాడు. వైసీపీ పార్టీ ఖాళీ అవ్వకుండా కాపాడుకునేందుకు అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. జమిలి ఎన్నికలపై కమిటీ వేశారు. కమిటీ అభిప్రాయాల మేరకు ఎప్పుడు జరుగుతాయో తెలియచేస్తారు. పార్లమెంట్ లో బలం ఉంటే బిల్లు పెట్టాలని రూల్ లేదు. జమిలి ఎన్నికల వల్ల ప్రజా ధనం ఆదా అవ్వడం తో పాటు దేశ అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతుంది. రాష్ట్రాలలో ఏదొక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పాలన పరంగా సంక్షేమ పథకాలు అమలు చేయటంలో ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తోంది.

బీజేపీ ఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ మాట్లాడుతూ దళితులని ఉద్ధరించిన విధంగా దళితుల కోసం కాంగ్రెస్ పుట్టినట్టుగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని, అంబేద్కర్ రెండు సార్లు పోటీ చేస్తే కాంగ్రెస్ ఓడించి అనేక విధాలుగా ఇబ్బందులకి గురిచేసిందని ఆరోపించారు. షర్మిల పై ఈ సందర్భంగా ఘాటు విమర్శలు చేశారు. అంబేద్కర్ నడియాడిన ప్రాంతాలలో బీజేపీ అంబేద్కర్ కోసం అనేక కార్యక్రమాలు చేసింది. పాత్రికేయుల సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎలిసే కిషోర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం, తదితరులు పాల్గొన్నారు.






## ప్రజల జీవితాలతో చెలగాటమాడి... జేబులు నింపుకొన్న వైసీపీ సర్కారు!

- కక్షపూరితంగా 'కుప్పం'పై నిర్లక్ష్యం
- దరికం లేని సమాజమే సీఎం లక్ష్యం
- చూస్తూ ఉండండి... కుప్పం దేశానికే రోల్ మోడల్ కాబోతోంది
- డ్వాక్రా ఏర్పాటుతో మహిళల జీవితాల్లో వెలుగులు
- వానగుట్టపల్లిలో మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి

**కుప్పం, మహానాడు:**

గత ప్రభుత్వం వారి జేబులు నింపుకోవడానికి ప్రజల జీవితాలతో చెలగాటమాడిందని, అభివృద్ధి అన్నమాట వినపడకుండా అరాచకం సృష్టించారని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. పేదరికం లేని సమాజం చంద్రబాబు కల అని ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నదే ఆయన కోరిక అని అన్నారు. రెండో రోజు కుప్పం పర్యటనలో భాగంగా వానగుట్టపల్లి గ్రామంలో భువనేశ్వరి పర్యటించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలతో ఏర్పాటుచేసిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

### డ్వాక్రా ఏర్పాటుతో మహిళలకు ఆర్థిక భరోసా

మహిళలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను చంద్రబాబు ప్రత్యక్షంగా చూశారు. డబ్బు కోసం ఆడబిడ్డలు కష్టపడకూడదు, ఎవరిపైనా ఆధారపడకూడదు అనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారు. ఒకప్పుడు వందా, రెండు వందల కోసం తండ్రిపైనో, భర్తపైనో ఆధారపడిన మహిళలు నేడు నేరుగా బ్యాంకుకు వెళ్లి లక్షల రూపాయిల లావాదేవీలు నడుపుతున్నారంటే అందుకు చంద్రబాబు తెచ్చిన డ్వాక్రా సంఘాలే కారణం. నేను కోరుకునేది ఒకటే... మహిళలు ఆర్థికంగా బలోపేతంగా ఉండాలి. తాము సంపాదించిన డబ్బును ఖర్చు చేసుకునే హక్కు వారికి ఉంటుంది. మహిళలు ఆనందంగా ఉంటే ఆ కుటుంబం కూడా సంతోషంగా ఉన్నట్టే.

### కుప్పం అభివృద్ధి మా ధ్యేయం

చంద్రబాబు నాయుడు ఎప్పుడూ కుప్పం గురించే మాట్లాడుతూ ఉంటారు. నన్ను గెలిపించి ఇంతవాణ్ణి చేసిన కుప్పం ప్రజల రుణం తీర్చుకోలేను అంటుంటారు. దురదృష్టవశాత్తు గత ఐదేళ్లు కుప్పం నియోజకవర్గం అభివృద్ధికి దూరమైంది. మీరు చంద్రబాబుని గెలుపించుకుని ముఖ్యమంత్రిని చేశారు. రాబోయే ఐదేళ్లలో కుప్పం అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలవబోతోంది.

### మోడల్ మున్సిపాలిటీగా కుప్పం

కుప్పంను మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దాలనే చంద్రబాబు ఆదేశాలకుఅనుగుణంగా 'కడా' అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అభివృద్ధి పనులకు మొదటి విడతగా రూ. 45 కోట్ల రూపాయలను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజ్ నిర్మాణం కోసం రూ. 110 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం, గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించడంలో భాగంగా ఏరియా ఆస్పత్రుల మరమ్మతుల కోసం రూ. 1కోటి 40 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

కుప్పం మున్సిపాలిటీలో సుమారు వెయ్యి లైట్లు కొనుగోలు చేసి వీధి దీపాలను అమర్చారు. పేదల ఆకలి తీర్చేందుకు కుప్పంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు జరిగింది. వచ్చే ఏడాది జూలై నాటికి హంద్రినీవా పూర్తయితే అందరికీ నీటి కష్టాలు తీరుతాయి. అలాగే కుప్పంలో ఎలీవ్ ఏర్పాటు కాబోతోంది. దీని వల్ల మహిళలకు ఉపాధి లభించడంతో పాటు వారే నలుగురికి ఉపాధి కల్పించే పరిస్థితులు వస్తాయి.

### వానగుట్టపల్లి నుంచి ఇక వలసలు ఉండవు



ఈ గ్రామంలో 45 పొదుపు సంఘాలు ఉన్నాయని చెప్పగానే నాకు సంతోషం అనిపించింది. మీరు ఆర్థికంగా బలోపేతం కావ డానికి, స్వయం ఉపాధి పొందేందుకు అన్ని విధాలా సహకరిస్తాం. ఇకపై ఈ గ్రామంలో వలసలు అనే మాట వినపడదు. ఇప్పటికే గ్రామంలో మూడు వాటర్ ట్యాంకులు, ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్, బోర్స్ వెల్స్ వేయించాం. మీ అందరి సొంతింటి కల నెరవేరుస్తాం. కుప్పంలో మొత్తం 15,323 కొత్త ఇళ్లు నిర్మించబోతున్నాము. ప్రతి ఒక్కరి ఇళ్లపై ఉచితంగా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే గుంతలు లేని రహదారులు నిర్మించబోతున్నాం. యువత భవిష్యత్ ను నాశనం చేసే గంజాయిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది.

### సమస్యల పరిష్కారానికి హామీ

వానగుట్టపల్లి గ్రామస్థులు నారా భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మన కుప్పం-మన చంద్రన్న




బల్లపై కూర్చోబెట్టారు. గత ఐదేళ్లుగా తాం ఎదుర్కొన్న ఇబ్బందులను, ప్రస్తుతం గ్రామంలో కావాల్సిన అభివృద్ధి పనుల గురించి భువనేశ్వరికి వివరించారు. సమస్యలన్నింటినీ ముఖ్యమంత్ర చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భువనేశ్వరి హామీ ఇచ్చారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 21, డిసెంబర్ 2024

# వైసీపీకి విశాఖ డెయిరీ ఛైర్మన్, డైరెక్టర్లు రాజీనామా!

**విశాఖపట్నం, మహానాడు:** అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ప్రతి రోజు ఎవరో ఒకరు పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. ఇప్పటికే ఎంతోమంది ప్రజాప్రతినిధులు వైసీపీని వీడారు. తాజాగా ఆ పార్టీకి మరో షాక్ తగిలింది. విశాఖ డెయిరీ ఛైర్మన్ అడారి ఆనంద్ కుమార్ వైసీపీకి వీడ్కోలు పలికారు.

పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఆనంద్ పేర్కొన్నారు.

ఆనంద్ తో పాటు 12 మంది డెయిరీ డైరెక్టర్లు కూడా వైసీపీకి రాజీనామా చేశారు. వీరిలో వరాహ వెంకట శంకర్రావు, పిల్లా రమా కుమారి, కోళ్ల కాటమయ్య, శీరంరెడ్డి సూర్యనారాయణ, ఆరంగి రమణబాబు, రెడ్డి రామకృష్ణ, దాడి పవన్ కుమార్, పరదేశి గంగాధర్, సుందరపు ఈశ్వర్, చిటికెల రాజకుమారి తదితరులు ఉన్నారు. వీరంతా తమ రాజీనామా లేఖలను వైసీపీ కేంద్ర కార్యాలయానికి పంపించారు.






# సీతారామాంజనేయుల్ని ఎందుకు అరెస్టు చేయలేదు? : హైకోర్టు


**అమరావతి:** కక్ష సాధింపులు అనుకుంటారన్న మోహమాటంతో నేరస్తుల్ని ఏపీ ప్రభుత్వం ఎలా వదిలి వేస్తుందో చెప్పే ఘటన ఇది. స్వయంగా ఏపీ హైకోర్టే కనీసం ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా వేయని ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయుల్ని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించింది. హీరోయిన్ జత్వానీని వేధించిన కేసులో.. కేసులు నమోదు కావడంతో ఇతర ఐపీఎస్‌లు, పోలీసులు ముందస్తు బెయిల్ కోసంకోర్టుకెళ్లారు. విచారణ పూర్తయ్యే వరకూ వారిని అరెస్టు చేయవద్దని కోర్టు చెప్పింది. ఈ విచారణ జరుగుతోంది. తాజాగా విచారణలో హైకోర్టు.. ఈ కేసులో ఏ 2గా ఉన్న ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయుల్ని ఎందుకు అరెస్టు చేయలేదని .. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ వేయలేదు కదా అని ప్రశ్నించింది.

# సిరిసిల్లను మళ్లీ ఉరిసిల్లగా మారుస్తున్న రేవంత్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్:** సర్కారు చేతిలో మరో నేతన్న బలి! ఇక నావల్ల కాదు అని దూస గణేష్ తన ఇద్దరు ఆడపిల్లలను అనాథలను చేసి వెళ్లిపోయాడు. సంవత్సర కాలంగా సాంచాలు సరిగా నడవకపోవడం వలన, ఉపాధి లేక, పని దొరక పోవడంతో అప్పులు తీర్చ లేక వెళ్లిపోయాడు. సిరిసిల్లను మళ్లీ ఉరిసిల్లగా మారుస్తున్న రేవంత్ రెడ్డి. వినిపిస్తున్నాయా ఆ చిన్నారుల ఆర్తనాదాలు? మార్పు అని ప్రగల్భాలు పలికిన నువ్వు వెళ్లి చెప్పు ఆ కూతుళ్లకు ప్రభుత్వం కక్ష సాధింపుల్లో క్షణం తీరికలేకుండా ఉంది అని! నేతన్నలైనా, రైతన్నలైనా తమ బిడ్డలను అనాథలుగా వదిలి వెళ్ళాల్సిందే అని! మరణ వాంగ్మూలాలు, అప్పుల చిట్టాలే. వారి బిడ్డలకి దక్కే ఆస్తులు అని!





# పరిటాల రవి హత్యకేసులో ముద్దాయిలు విడుదల

**కడప, మహానాడు:** పరిటాల రవి హత్య కేసులో కడప సెంట్రల్ జైలు నుంచి ముద్దాయిలు విడుదల అయ్యారు. నారాయణ రెడ్డి (ఏ3), రేఖమయ్య (ఏ4), బజన రంగనాయకులు (ఏ5), వడ్డే కొండ (ఏ6), ఓబిరెడ్డి (ఏ8) లకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.




ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌ని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతి భద్రతలపై చర్చించారు.

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో సెమీ క్రిస్మస్

- రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ సుభాకాంక్షలు తెలిపిన నేతలు

**మంగళగిరి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో నేడు క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనతరం క్రిస్మస్ కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రేమ, దయ, శాంతికి యేసు క్రీస్తు మార్గదర్శి అని.. అందరూ ఆ ప్రభువైన యేసు చూపిన మార్గంలో నడిచి తనను వలే తన ఎదుటివారిని ప్రేమించాలన్నారు.



రాష్ట్రంలో శాంతికి సుపరిపాలనకు సర్వమత స్వేచ్ఛకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని మతాలను గౌరవించే గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, కార్పొరేషన్ ఛైర్మన్ లు పిల్లి మాణిక్యరావు, పీలా గోవింద సత్యనారాయణ, తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి మాజీ క్రిస్టియన్ కార్పొరేషన్ ఛైర్మన్ మద్దిరాల జోసఫ్ ఇమ్మానుయేల్, టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాసు, కుమార్, కె.కె. ప్రభాకర్, భాగ్యరాజు తోపాటు, రివరెంట్ కుమార్, బిసప్ లు, పాస్టర్లు, విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొని సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# మంగళగిరి నియోజకవర్గాన్ని నా గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా...

- ప్రజలు నాపై పెట్టిన బాధ్యతను తూచా తప్పకుండా నెరవేరుస్తా
- మంగళగిరిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి నారా లోకేష్
- బాప్టిస్టుపేటలో క్రిస్మస్ స్టార్ ఆవిష్కరణ
- ఏపీఎస్పీ 6వ బెటాలియన్ క్యాంప్ సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేష్



**మంగళగిరి, మహానాడు:** నియోజకవర్గాన్ని తన గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని, ప్రజలు తనపై పెట్టిన బాధ్యతను తూచా తప్పకుండా నెరవేరుస్తానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంగళగిరి పట్టణంలో బాప్టిస్టుపేట, ఏపీఎస్పీ 6వ బెటాలియన్ క్యాంప్ లో ఏర్పాటుచేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని సందడి చేశారు. బాప్టిస్టుపేట యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 45 అడుగుల అతిపెద్ద క్రిస్మస్ స్టార్ ను మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

క్రైస్తవ సోదరులకు మంత్రి లోకేష్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. క్రిస్మస్ అంటే మనదగ్గర ఉంది లేనివాళ్లకు ఇవ్వడం.. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం. 2019లో 21 రోజుల ముందు మంగళగిరి నియోజకవర్గానికి వచ్చా. నేనేంటో మీకు తెలియదు. మీరేంటో నాకు తెలియదు. ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయాను. తర్వాత ఎక్కడికీ వెళ్లకుండా కసితో పనిచేశా. 2024 ఎన్నికల్లో భారీ మెజార్టీతో ప్రజలు నన్ను ఆశీర్వదించారు.

దేవుడు ఒక్కొక్కరికి ఒక్కో కష్టం పెడతాడు. పరీక్షను జయించే శక్తి కూడా ఇస్తాడు. నేను 5 ఏళ్లు కష్టపడ్డా. నాపై అక్రమంగా 23 కేసులు పెట్టారు. 226 రోజుల పాటు 3,132 కి.మీల పాదయాత్ర చేశా. ఇప్పుడున్న తరం చిన్న ఎగ్జామ్ ఫెయిల్ అయితేనే ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. అందరూ ధైర్యంగా ఉండాలి. ఏసుప్రభు అందరం కలిసిమెలిసి ఉండాలని చెప్పారు. కష్టాల్లో ఉన్నవారిని వ్యక్తిగతంగా ఆదుకోవాలి. కలిసికట్టుగా ఉంటే సమాజంలో విప్లవం వస్తుంది. 2024 ఎన్నికల్లో అది చూశాం.

## యుద్ధప్రాతిపదికన ఇళ్ల పట్టాల మంజూరు

గత 6 నెలల కాలంలో మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. యుద్ధప్రాతిపదికన ఇళ్ల పట్టాలు మంజూరూ చేస్తాం. ఇప్పటికే పనులు ప్రారంభించాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీరు అందించడంతో పాటు అండర్ గ్రౌండ్ పవర్, గ్యాస్ అందిస్తాం. కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు చేపడతాం. నియోజకవర్గవ్యాప్తంగా 85 పార్కులను అభివృద్ధి చేస్తాం. ఇప్పటికే అందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాం. అన్నీ క్రమపద్ధతిలో చేస్తాం. గత ఎన్నికల్లో నాకు అండగా నిలబడ్డారు. అందువల్లే కేబినెట్ లో మంగళగిరి నియోజకవర్గం




గురించి పోరాడగలుగుతున్నా. ఇప్పటికే వంద పడకల ఆసుపత్రి మంజూరు చేయడం జరిగింది. నియోజకవర్గంలో అనేక కంపెనీలు రాబోతున్నాయి. యువతకు స్థానికంగానే ఉద్యోగాలు కల్పిస్తామని లోకేష్ వెల్లడించారు.

## ఆంధ్రరాష్ట్ర పోలీసులకు పూర్వవైభవం తీసుకువస్తాం

ఏపీఎస్పీ 6వ బెటాలియన్ క్యాంప్ లో ఏర్పాటుచేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. 1995లో ఆంధ్రరాష్ట్ర పోలీసులు నెం.1గా ఉండేవారు. గడచిన ఐదేళ్లలో గత ప్రభుత్వం పోలీసు వ్యవస్థను వ్యక్తిగత కక్ష సాధింపు కోసం వాడుకున్నారు. నాపై అక్రమంగా 23 కేసులు నమోదు చేశారు. ఆంధ్రరాష్ట్ర పోలీసులకు పూర్వవైభవం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మన బెటాలియన్ రాజధానిలో ఉంది. రాబోయే రోజుల్లో మన బెటాలియన్ కీలకపాత్ర పోషిస్తుంది. పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని, గత ప్రభుత్వ పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని లోకేష్ తెలిపారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో కూటమి నేతలతో పాటు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# భూ భారతి కాదు.. భూ హారతి

- కాంగ్రెస్ నేతల భూ కబ్జాలకు హారతి
- రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు మంగళ హారతి
- రేవంత్ చిప్పకూడు తిని అందరికీ చిప్పకూడు తినిపించాలనుకుంటున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్:** 75 లక్షల మంది రైతులు కోటి 50 లక్షల ఎకరాలకు ధరణి చట్టం హక్కులు కల్పించింది. ఈ రోజు ఆమోదించిన చట్టం భూ భారతి కాదు భూ హారతి ..కాంగ్రెస్ నేతల భూ కబ్జాలకు హారతి. రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు మంగళ హారతి. భూ భారతి చట్టం రైతుల పాలిట పిడుగు పాటు లాంటిదే. ఇక రేపట్నుంచి పేదలకు కష్టాలు మొదలు.

కేవలం పది శాతం సమస్యలు కూడా లేని ధరణి చట్టం ను రద్దు చేయడం దారుణం. ధరణి తో పారదర్శకత పెరిగింది. 12 కోట్ల మంది ధరణి వెబ్సైట్ విసిట్ చేశారు. లక్షల ట్రాన్సక్షన్స్ జరిగాయి. అసెంబ్లీ లో పొంగులేటి పచ్చి అబద్దాలు ఆడారు. నిజాం తర్వాత తెలంగాణ లో భూమి నంతా 86 సంవత్సరాల తర్వాత కేసీఆర్ సర్వే (ఎల్ఆర్‌యూపి )చేయించి హక్కు పత్రాలు ఇచ్చారు.

సీఎంఓలో ఉన్న అధికారులందరూ ధరణి చట్టంలో పాలు పంచుకున్నవారే. వారిని కూడా రేవంత్ తప్పబడుతున్నారా? కేసీఆర్ తెచ్చిన సాఫ్ట్ వేర్ ను వాడుతూ రేవంత్ గత ప్రభుత్వాన్ని తప్పు పడుతున్నారు. 70 లక్షల మంది రైతులకు సంబంధించి కోటి 52 లక్షల ఎకరాలకు ధరణి లో చిన్న తప్పు కూడా దొర్లలేదు. 27 లక్షల ట్రాన్సాక్షన్లు జరిగిన ధరణి సాఫ్ట్ వేర్ లో లోపభూయిష్టాలు ఉన్నట్టా ? సాఫ్ట్వేర్ అనేది ఎప్పటికపుడు అప్ డేట్ చేసుకోవాలి.

విదేశీ సంస్థల చేతిలో ధరణి సాఫ్ట్ వేర్ అనేది పూర్తి అబద్ధం. జమాబందీ తిరిగి తెస్తున్నారు ఇది అక్రమార్కులకు పండగే. పాతీ విధానం తేవడం తిరోగమన చర్య. కుటుంబం లో మళ్ళీ తగాదాలు మొదలవుతాయి. అనుభవదారు కాలమ్ పెడతారట ..రైతు కౌలు రైతు కొట్లాడాలి. కొత్త దుకాణాలు మొదలై భూ భారతి తో అవినీతి విచ్చల విడి అవుతుంది. ఎమ్మార్వో సంతృప్తి చెందితేనే మ్యుటేషన్ అనేది మరో అవినీతి దుకాణం. భూ భారతి తో రైతుల గుండె దడ మొదలైంది. భూ భారతి చట్టాన్ని బీ ఆర్ ఎస్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది. రైతులతో కలిసి భూ భారతి పై పోరాటం చేస్తాం.

## చెప్పులు, బాటిళ్లతో మాపై దాడి చేశారు :ఎమ్మెల్యే కె.పి.వివేకానంద

అసెంబ్లీ సమావేశాలు ఓ పద్ధతి లేకుండా నడుస్తున్నాయి. శాసనసభ చరిత్రలోనే కొత్త సంప్రదాయాలకు రేవంత్ తెర లేపింది. రూల్స్ కు వ్యతిరేకంగా సమావేశాలు నడుస్తున్నాయి. నియమాలు నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారం సభ ను నడుపుతున్నారు. అసెంబ్లీ సమావేశాలే నడప లేకపోతున్నారు. ఇక ప్రభుత్వాన్ని ఏం నడుపుతారు ? సీఎం అనుభవరాహిత్యం తో సమస్యలు వస్తున్నాయి. సీఎం తీరు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల నుంచి దృష్టి మరల్చడానికే రేవంత్ మా నేత కేటీఆర్‌పై కేసు పెట్టారు. పన్నెండు నెలల్లో పన్నెండు విచారణలు చేశారు. రేవంత్ పాలన మీద దృష్టి పెట్టలేదు. ఫార్ములా ఈ రేసింగ్ తో రాష్ట్ర ప్రతిష్ట పెరిగింది. కుంభకోణంగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. చర్చ కోసం పట్టుబడితే కాంగ్రెస్ సభ్యులు మా మీద దాడి చేశారు. చెప్పులు ,బాటిళ్లతో మా పై దాడి చేశారు. ప్రతిపక్ష సభ్యులకు హక్కులుండవా? కొన్ని వీడియోలే కావాలని



బయట పెట్టారు. సీఎం ప్రోద్బలంతోనే కాంగ్రెస్ సభ్యులు రెచ్చిపోతున్నారు. సీఎంకు దమ్ము లేదు కనుకే ఫార్ములా ఈ రేసింగ్ పై చర్చకు ఒప్పుకోలేదు. సీఎం కు చర్చ జరిగితే నిజాలు బయట పడుతాయి అని ఒప్పుకోలేదు. వీడియో లు ఎవరి అనుమతితో బయట పెట్టారు? కొత్త సంప్రదాయానికి తెరలేపారు. దీంట్లో కుట్ర కోణం ఉంది.

## తెలంగాణ పరువు అంతర్జాతీయంగా పోయింది :ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

ఈ రోజు అసెంబ్లీలో ఒక్క వ్యక్తి కోసం కొట్లాడలేదు. నాలుగు కోట్ల మంది ప్రజల కోసం కొట్లాడాం. తెలంగాణ పరువు అంతర్జాతీయంగా పోయింది. లండన్ లో ఫార్ములా ఈ తెలంగాణ ప్రభుత్వం పై కేసు వేసింది. కాంట్రాక్టు ఉల్లంఘన కేసు ప్రభుత్వం పై పెట్టడం రాష్ట్రానికి అవమానం. తెలంగాణ ప్రజల కోసమే స్పీకర్ పోడియం లోకి వెళ్లాం. అసలు కేటీఆర్‌పై పెట్టిన కేసు అక్రమ కేసు. రేవంత్ చిప్పకూడు తిని అందరికీ చిప్పకూడు తినిపించాలనుకుంటున్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే చెప్పు చూపించిన వీడియో కూడా బయట పెట్టాలి. రేవంత్‌వి డైవర్షన్ రాజకీయాలు.

# రేవంత్‌ను మళ్లీ జైలుకు పంపిస్తేనే తెలంగాణ పరుగులు

- ఎవరినడిగి మీరు ఫార్ములా-ఇ అగ్రిమెంట్ రద్దుచేశారు?
- మీరు ముందు నిపుణుల కమిటీ తో చర్చించారా?
- దీనిపై కేబినెట్ అనుమతి తీసుకున్నారా?
- ఈ కార్ రేస్ కేటీఆర్ ఎసిబి కేసుపై ఎక్స్‌లో బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్

**హైదరాబాద్:** నేను రెండు సంవత్సరాలు హైదరాబాద్ క్రైమ్ బ్రాంచ్ డీసీపీగా ఎన్నో ఆర్థిక నేరాలను పరిశోధించాను. అదే అనుభవంతో ఇప్పుడే కేటీఆర్ మీద సీయం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఏసీబి నమోదు చేసిన FIR 14/2024లోని అన్ని వివరాలను రెండు సార్లు లోతుగా పరిశీలించాను. ప్రపంచంలో ఇంత తుఫైల్ (worst) కేసు ఇంకొకటి ఉండదు.

గమ్మత్తేందంటే ప్రస్తుత పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చే ఇప్పించిన ఫిర్యాదులో, ఎక్కడ కూడా సదరు 55 కోట్ల రూపాయల నుండి 'ఒక్క పైసా' కూడా 'కేటీఆర్ జేబుల్లోకి' వెళ్లినట్టు నిరూపించలేక పోయారు. పాపం ఆరు నెలలు శ్రమించారు కదా ! ప్రజలు మీకిచ్చిన విలువైన సమయాన్ని నీళ్ల పాలు చేశారు.

ఆ మాటకొస్తే అరవింద్ కుమార్ ఐఎఎస్ మరియు ఛీఫ్ ఇంజనీరు బీ ఎల్ ఎన్ రెడ్డి ల మీద కూడా అవినీతి జరిగినట్లు ఈ ఫిర్యాదులో నిరూపించలేక పోయారు. మీరు చూపించగలిగిందంతా ప్రొసీజర్ వయోలేషన్స్ మాత్రమే. వీటికి శాఖా పరమైన ఎంక్వైరీ




వేసి నిజమేందో తెలుసుకుంటే సరిపోయేది. అది ఇప్పటికే జరిగింది.

సచివాలయంలో ఇలాంటి ప్రొసీజర్ వయోలేషన్స్ ప్రతి డిపార్ట్మెంట్‌లో రోజూ జరుగుతుంటయి. అట్ల చేయకపోతే అనుకున్న లక్ష్యం నెరవేరదు. ప్రజలు ఇబ్బంది పడతారు. ఇలాంటి వయోలేషన్న్లు తరువాత కేబినెట్ లో పెట్టి క్రమబద్ధీకరిస్తారు. వీటి మీద స్పష్టత లేని వాళ్లకు ప్రతీది వయోలేషన్ లాగానే కనిపిస్తది.

ఇందులో ఖర్చు పెట్టిన ? 55 కోట్లు రాష్ట్రంకు వందల కోట్ల రాబడి కోసమే పెట్టినం, మీకేమైనా అనుమానాలు ఉంటే అన్నీ అసెంబ్లీ సాక్షిగా నివృత్తి చేస్తా అని కేటీఆర్ అంటున్నా మొఖం చాటేసి పిరికిపందల్లా ఏసీబీకి ఫైలు అప్పగించారు.

అసలు ఈ విషయం లో ప్రభుత్వ ఖజానా కు ఏమైనా నష్టం జరిగిందంటే అది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్లనే. ఎవరినడిగి మీరు ఫార్ములా-ఇ అగ్రిమెంట్ రద్దుచేశారు? మీరు ముందు నిపుణుల కమిటీ తో చర్చించారా? దీనిపై కేబినెట్ అనుమతి తీసుకున్నారా? మీ వల్లే తెలంగాణకు వచ్చే వందల కోట్ల రాబడి ఆగిపోయింది. మన నగరానికొచ్చే ఫార్ములా రేసింగును పక్కన కర్నాటక తన్నుకు పోయింది. అసలు ఈ ఫార్ములా -ఈ కేసు లో రేవంత్ రెడ్డి A-1. కేటీఆర్ కాదు. ముమ్మాటికీ కాదు. అసలు నేడు తెలంగాణ ఖజానా ఖాళీ గా ఉండటానికి కారణం రేవంత్ రెడ్డి. ఆయన్ను మళ్లీ జైలుకు పంపిస్తేనే తెలంగాణ మళ్లీ పరుగులు పెడ్తది.

# సీఎం రేవంత్‌రెడ్డికి టి.డి.జనార్ధన్ కృతజ్ఞతలు

- ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టాపనకు స్థలం మంజూరు

**విజయవాడ:** హైదరాబాద్‌లో, ప్రత్యేకించి ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్వవిఖ్యాత నటసార్వభౌములు నందమూరి తారక రామారావు 100 అడుగుల విగ్రహం ప్రతిష్టాపనకు మరియు ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రభుత్వపరంగా స్థలం కేటాయించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించడం ఎంతో సంతోషం.

ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్సీ టి.డి. జనార్ధన్, ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ, ఎన్టీఆర్ లిటరేచర్ సభ్యులు మధుసూదనరాజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా గత ఏడాదిన్నరకాలంగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చేపట్టిన కార్యక్రమాలను టి.డి. జనార్ధన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు.

హైదరాబాద్‌లో 100 అడుగుల ఎత్తుతో ఎన్టీఆర్ విగ్రహాన్ని నెలకొల్పాలన్న తమ సంకల్పాన్ని వివరించి, దానితోపాటు ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, ఓ పర్యాటక కేంద్రంగా



తీర్చి దిద్దాలనుకొంటున్నామని, ఇందుకు గాను తెలంగాణ ప్రభుత్వం తరపున స్థలాన్ని కేటాయించి సహకరించాలని టి.డి. జనార్ధన్, నందమూరి మోహనకృష్ణలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకొని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజలందరికీ ఇష్టమైన నటుడు, నాయకుడని.. ఆయన 100



అడుగుల విగ్రహం హైదరాబాద్‌లో ప్రతిష్టించాలన్న ప్రతిపాదనకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూల స్పందనకు ఎన్టీఆర్ అభిమానులందరూ సంతోషిస్తారని పేర్కొంటూ..ఆయనకి ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ తరపున తమ కృతజ్ఞతలను, ధన్యవాదాలను టి.డి. జనార్ధన్ తెలియజేశారు.

06

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 21, డిసెంబర్ 2024 ||





# తప్పుడు డాక్యుమెంట్లతో భూమి కబ్జా!

- భూ కబ్జాలు, సమస్యలపై గ్రీవెన్స్ లో మొరపెట్టుకున్న బాధితులు
- అర్జీలు స్వీకరించిన రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రి సవిత, చైర్మన్ లు పీలా గోవింద సత్యనారాయణ, గొట్టిముక్కల రఘురామరాజు, మన్నవ మోహన కృష్ణ

మంగళగిరి, మహానాడు: రాష్ట్ర నలుమూలల నుండి వివిధ సమస్యలపై అర్జీ దారులు శుక్రవారం తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయానికి తరలి వచ్చారు. ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి సవిత,






కార్పొరేషన్ చైర్మన్ లు పీలా గోవింద సత్యనారాయణ, గొట్టిముక్కల రఘురామరాజు, మన్నవ మోహన కృష్ణలు వారి నుండి అర్జీలు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి వెను వెంటనే అర్జీదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారు.

- విశ్వబ్రాహ్మణ స్వర్ణకార ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించేలా కేవలం విశ్వబ్రాహ్మణ స్వర్ణకార వృత్తి కలిగిన వారిని మాత్రమే బ్యాంక్‌ల్లో గోల్డ్ అప్రైజర్స్ గా తీసుకోవాలని ఆ సంఘ సభ్యులు గ్రీవెన్స్‌లో నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే అన్ని దేవాలయాల్లోని ఆలయ ట్రస్టు బోర్డుల్లో తమకు పదవులు ఇచ్చి ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి వేడుకున్నారు.
- గుంటూరుకు చెందిన తిరువీధి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. తాము గుంటూరులోని ఐపీడీ కాలనీలో ఉంటున్న వెంకటేశ్వరరెడ్డి వద్ద ఇల్లు కొనుగోలు చేశామని.. అతనికి డబ్బులు ఇచ్చిన తరువాత ఇంటిని ఖాళీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నాడని చేతనైంది చేసుకోమని బెదిరిస్తున్నారని నాగేశ్వరరావు వాపోయారు.
- పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరులో తన భర్తకు రావాలసిన భూములను తన చిన్నమామ గారి కుమారులు తప్పుడు డాక్యుమెంట్ లతో పేర్లు మార్చి కొట్టేశారని.. దీనిపై కలెక్టర్ ఆఫీసు చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని.. తప్పుడు డాక్యుమెంట్‌లపై విచారించి వాటిని రద్దు చేసి తనకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.
- కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామ పరిధిలో ఉన్న పట్టా భూమిని నిషేధిత జాబితా పరిధిలో చేర్చారని.. తమ సమస్యను పరిష్కరించాలని అనేక సార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని.. దయ చేసి తమ భూ సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



- ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చి వారి అభివృద్ధికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి సాయం చేయాలని ఆ సంఘ నాయకులు నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేతలను కలిసి అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటిన ఖాళీ చేయమని తమపై దౌర్జన్యం చేస్తూ కొడుతున్నారని.. విజయవాడకు చెందిన రాయన చాముండేశ్వరి నేతల ముందు వాపోయారు. అన్యాయంగా తనపై దాడి చేసిన సరోజిని ఆమె కొడుకు మనోజ్‌లపై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేశారు.
- అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన మల్లిఖార్జున రాజు, షేక్ ఇబ్రహీం తదితరులు గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేస్తూ.. తాము గతంలో కొన్న భూమిని కబ్జా చేసేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కనకంటి ప్రభాకర్ రెడ్డి యత్నిస్తున్నారని.. అతనికి రెవెన్యూ అధికారులు పోలీసులు సహకరిస్తూ.. తమనే బెదిరిస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.









# వైసీపీ రాక్షస పాలనతో రాష్ట్రం 30 ఏళ్ళు వెనక్కెళ్లింది

- ఏపీని లూటీ చేసి అప్పులు మన నెత్తిన పెట్టిపోయారు
- రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు
- కుప్పం నియోజకవర్గాన్ని నెంబర్ వన్‌గా అభివృద్ధి చేస్తాం
- అడవిబూదుగూరులో మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి

కుప్పం, మహానాడు: గత ప్రభుత్వ విధ్వంస పాలనతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని, రాష్ట్రాన్ని లూటీ చేసి అప్పులు మన నెత్తిన వేసి వెళ్లారని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పం నియోజకవర్గంలో రెండో రోజు పర్యటనలో భాగంగా అడవిబూదుగూరులో పర్యటించారు. మహిళలతో ఏర్పాటుచేసిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడూ రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలా అనే ఆలోచిస్తుంటారు.

పేదరికం లేని సమాజం రావాలని, అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. చంద్రబాబు తన పాలనా సామర్థ్యం, విజన్ తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతారు నాకు నమ్మకం ఉంది...గడిచిన ఐదేళ్లలో రాక్షస పాలనలో టీడీపీ కార్యకర్తలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. పల్నాడులో చంద్రయ్యను అన్యాయంగా చంపేశారు. కార్యకర్తల త్యాగాలు వెలగట్టలేనివి. కష్టకాలంలోనూ చంద్రబాబుపైన నమ్మకం పెట్టుకుని ఆయన



చెయ్యి వదలకుండా పనిచేశారు. కార్యకర్తలను ఆదుకుంటాం. వారి బాధ్యత మాదే. కుప్పం ప్రజలు చంద్రబాబుని ఎనిమిది సార్లు గెలిపించారు. కుప్పం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఒక్క కుప్పం మాత్రమే కాదు... ప్రతి జిల్లాను హబ్ గా తయారుచేస్తారు.

## మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యం

డ్వాక్రా ఏర్పాటుతో మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యారు. బ్యాంకు లావాదేవీలు స్వయంగా చేయగలుగుతున్నారు. మహిళల ఆర్థిక ప్రగతికి చేయూత అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం. మహిళా పారిశ్రామిక వేత్తల కోసం కుప్పం మండలంలో ఎలీప్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా మహిళలు ఉద్యోగాలు చేయడమే కాదు. ఉపాధి పొంది మరో పదిమందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకుంటారు. గత ఐదేళ్లలో కుప్పం నుంచి ఎంతోమంది ఉద్యోగాల కోసం, బతుకుతెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. ఇక ఆ పరిస్థితి ఉండదని హామీ ఇస్తున్నాను. ఇప్పటికే మేం మహిళల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభించి టైలరింగ్ పలు వాటిలో శిక్షణ ఇస్తున్నాం. అంతకుముందు అడవి బూదుగూరులోని జడ్పీ స్కూల్ విద్యార్థులతో భువనేశ్వరి ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు.

# వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే 'బియ్యం మాఫియా' విజృంభణ

- టీడీపీ నేత చేజర్ల వెంకటేశ్వరరెడ్డి

నెల్లూరు, మహానాడు: పేదల ఆకలితెర్చేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పథకం, పేదల కంటే రేషన్ మాఫియాకే ఎక్కువ ఉపయోగపడుతోంది. ఈ పథకం కోసం ఏడాదికి కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు నెల్లూరు లోని పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

ఈ పథకం కింద కిలో బియ్యానికి ప్రభుత్వం రూ.43 ఖర్చు చేస్తుంటే, దానిలో పేదలకు రూ.10 చేందుతుంటే, రేషన్ మాఫియాకు రూ .33 చేరుతుంది. పేదలకు చెందాల్సిన వేల కోట్ల రూపాయలు మాఫియా జేబుల్లోకి వెళుతున్న ఈ పథకం పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం చేసి, ఈ పథకంలో మార్పులు తేవాలని అభిప్రాయపడ్డారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. రేషన్ కార్డు దారులకు అప్షన్ ఇచ్చి బియ్యం కావాలనే వారికి బియ్యం ఇచ్చి, బియ్యం వద్దు అన్న వారికి కేజీ కి రూ.43 నగదు బదిలీ చేయాలి.

దేశంలోని మొదటి సరిగా దివంగత నందమూరి తారక రామారావు,



రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని మన రాష్ట్రంలో 1983లో ప్రవేశ పెట్టారు. 1992 నుండి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా దేశ వ్యాప్తంగా బియ్యం అందిస్తుంది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో రేషన్ బియ్యం మాఫియా విజృభించింది. ఆ అయిదేళ్ళ కాలంలో దాదాపు 1.30 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని ఒక అంచనా. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, చట్టాల్లో మార్పులు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.











# జీసస్ ప్రబోధించిన ప్రేమ, దయ, కరుణ అలవర్చుకోవాలి





- మంగళగిరి నిర్మలా కళాశాల సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేష్

మంగళగిరి, మహానాడు: ఏసుక్రీస్తు ప్రబోధించిన ప్రేమ, దయ, కరుణ అందరూ అలవర్చుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి సమీపం ఆత్మకూరులోని నిర్మల ఫార్మశీ కళాశాలలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి రాకను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు. అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలి. ఈ సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం నాకు చాలా ఆనందంగా ఉంది. సిస్టర్స్ నన్ను కలిసినప్పుడు నాకు చిన్నప్పటి పాఠశాల రోజులు గుర్తుకువచ్చాయి. అప్పుడు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేవారు.

క్రిస్మస్ అంటే ప్రేమ, దయ, కరుణ. మనమేంటో ఇతరులకు తెలియజెప్పడం. ప్రతిఒక్కరి పట్ల ప్రేమ, శాంతిని కలిగి ఉండాలని జీసస్



బోధించారు. 2019 నుంచి మంగళగిరిలో నా ప్రయాణాన్ని ప్రారంభించాను. అప్పటి ఎన్నికల్లో ఓటమి చెందాను. ఓటమి నుంచే పాఠాలు నేర్చుకున్నాను. ఎన్ని ఓటములు ఎదురైనా మనోధైర్యాన్ని కోల్పోకూడదు. వైఫల్యం విజయానికి సోపానం. అందుకు నేనే ఉదాహరణ. దేవుడు మనకు అనేక పరీక్షలు పెడతాడు. వాటన్నింటిని కృషి, పట్టుదల, కఠోర శ్రమతో అధిగమించాలి. దేవుడు ప్రతిఒక్కరికి శక్తినిస్తాడు. మన గురించి కాకుండా సమాజం గురించి కూడా ఆలోచించాలి. దేశానికి నువ్వేమి చేశావని గుర్తుంచుకోవాలి. వందేళ్ల స్వతంత్ర భారత్ దిశగా పయనిస్తున్న సమయంలో 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. ఇందుకు యువత తమవంతు బాధ్యత వహించాలి. మా కుటుంబంలో కూడా క్రిస్మస్‌తో పాటు అన్ని పండుగలను జరుపుకుంటాం. ప్రతిఒక్కరు ఇతరుల పట్ల సహనంతో వ్యవహరించి మన సంప్రదాయాలను ముందుకుతీసుకెళ్లాలన్నారు.

నిర్మల ఫార్మశీ కళాశాలలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకులు ఆద్యంతం ఆహ్లాదభరిత వాతావరణంలో కొనసాగాయి. ముందుకు కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు నిర్వాహకులు, విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ప్రార్థనా గీతంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అకడమిక్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ బహుమతులు అందజేశారు. అనంతరం మంత్రి లోకేష్ ను



శాలువా, మెమెంటోతో కళాశాల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్, ఆంధ్ర లయోల కాలేజీ ఎస్-జె ఫౌండర్, డైరెక్టర్ బాల బొల్లినేని, రివరెండ్ సిస్టర్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ యు.షౌరీలు, రివరెండ్ సిస్టర్, కళాశాల కరస్పాండెంట్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాముల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

07

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 21, డిసెంబర్ 2024 ||







బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో
ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలి

- బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ళ మహేందర్ డిమాండ్

హైదరబాద్, మహానాడు: పార్లమెంట్లో ఎన్డీఏ ఎంపీలపై రాహుల్ గాంధీ చేసిన దాడిని భారతీయ జనతా యువమోర్చా తెలంగాణ రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండిస్తుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు బాబాసాహెబ్ అంబేద్కర్ ను అనేక అవమానాలకు గురి చేసింది. ఆయన చనిపోయాక కనీసం భారతరత్న కూడా ప్రకటించ లేదని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ళ మహేందర్ విమర్శించారు. తక్షణం రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన, బీజేవైఎం కార్య కర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లా డారు. రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకొని మీడియా ముందు ఫోజులు కొట్టడం తప్ప ఏనాడు రాజ్యాంగాన్ని గౌరవించలేదని దుయ్యబట్టారు.



70 ఏళ్ల కాంగ్రెస్ చరిత్రలో ఒక దళితుడిని రాష్ట్రపతిగానో, స్పీకర్ గానో, పార్టీ జాతీయ అధ్యక్షుడిగానో గుర్తించలేదని విమర్శించారు. తోటి ఎంపీలపై దాడి చేసిన రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. కాగా, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన ప్రదర్శన చేస్తున్న బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ చర్యను మహేందర్ తీవ్రంగా ఖండించారు. నిరసన కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, చితరంజన్ రెడ్డి, సంతోష్, రాష్ట్ర కార్యదర్శులు ప్రవీణ్, అశోక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్, నితిన్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు సుధీంద్ర శర్మ, అరవింద్, అనిత, అవినాష్, శ్రావణ్, చక్రి, శివ, గోవర్ధన్, వినేయ్, అవినాష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.







## చంద్రబాబు జీవితం ప్రజలకే అంకితం

- 2047 నాటికి ఏపీ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుంది
- కుప్పం అభివృద్ధికి 40 పథకాలు అమలు చేస్తున్నాం
- డీకే పల్లిలో మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి

కుప్పం, మహానాడు: గత ప్రభుత్వంలో పేదల పొట్ట కొట్టి వారి పొట్ట నింపుకున్నారని, అన్ని వర్గాల ప్రజలను వేధించారని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. మచ్చ లేని చంద్రబాబు కి అవినీతి మరక అంటించేందుకు అక్రమ కేసులు బనాయించి జైలు పాల్జేశారని అన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని డీకే పల్లిలో



భువనేశ్వరి పర్యటించారు. మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ... చంద్రబాబు ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారు. ఆయనకు ప్రజలే కుటుంబం. మేము ఎప్పుడూ ప్రజల సొమ్ము దోచుకునేవారం కాదు. రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్రలు చేశారు. విధ్వంస పాలనతో సర్వనాశన మైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. ఆయన పాలనలో అభివృద్ధిలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలవడం ఖాయం.



### నిజం గెలవాలి యాత్రతో ప్రజలకు మరింత చేరువ

నేను నిజం గెలవాలి యాత్ర చేయాలనుకున్నప్పుడు కొందరు శ్రేయోభిలాషులు వద్దని వారించారు. మహిళ అని కూడా చూడకుండా ఇబ్బంది పెడతారని హితవు పలికారు. కానీ ముందుకు నడిచాను. పార్టీ కార్యకర్తలు నాకు అండగా నిలబడ్డారు. యాత్రలో నేను అన్ని వర్గాల ప్రజలకు స్వయంగా కలుసుకున్నాను. వారు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. గత పాలకులు యువతను గంజాయికి బానిసలు చేసి వారి భవిష్యత్ నాశనం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. కుప్పం ప్రజలు, రాష్ట్ర ప్రజలకు నేను ఒకటే చెబుతున్నాను. చంద్రబాబు ఏపీని ఖచ్చితంగా నెంబర్ వన్ స్టేట్ చేస్తారని హామీ ఇస్తున్నాను.

అంతకుముందు నారా భువనేశ్వరిని మహిళలు పూలు, హారతులతో ఘన స్వాగతం పలికారు. వేదిక సమీపంలో ఉన్న ప్రసన్న అగ్ని మారెమ్మ దేవస్థానంలో భువనేశ్వరి విశేష పూజలు చేశారు. ముఖాముఖి అనంతరం ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేయగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు.

## అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో క్రీడా సౌకర్యాలు

- ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం లక్ష్యం
- దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీ
- నేషనల్స్, ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు సిద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్రమంత్రులతో శాప్ ఛైర్మన్ రవినాయుడు
- కేంద్ర క్రీడాశాఖ మంత్రి మాండవ్య, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడులకు వినతి
- స్పోర్ట్స్ ప్రాజెక్టులు, లైఫ్ సేవింగ్ కోర్సుల ఏర్పాటుపై భేటీ
- విశాఖలో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించాలని విజ్ఞప్తి

విజయవాడ,మహానాడు:

అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన క్రీడాసౌకర్యాలను ఆంధ్రప్రదేశ్‌లో నెలకోల్పాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సెంట్రల్ మినిస్టర్ మన్సుక్ మాండవ్య ని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా అమలాపురం ఎంపీ, ఏపీ స్పోర్ట్స్ పార్లమెంటరీ ఇన్‌ఛార్జ్ జీఎమ్ హరీష్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి కేంద్ర క్రీడాశాఖమంత్రి మాండవ్యను శుక్రవారం ఆయన కలిశారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని క్రీడారంగానికి మంజూరు చేయాల్సిన ప్రాజెక్టులపై రవినాయుడు చర్చించారు. రూ.237 కోట్లతో మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన 24 స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను ఖేలో ఇండియా ద్వారా మంజూరు చేయాలని రవినాయుడు విన్నవించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గతంలో ప్రతిపాదించిన రెండు నేషనల్ ఎక్స్‌లెన్సీ సెంటర్లను కాకినాడ, గుంటూరు పట్టణాలకు మంజూరు చేయాలని కోరారు.

కాకినాడలో హాకీ, షూటింగ్, గుంటూరు ఏఎన్‌యూలో అథ్లెటిక్స్ ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఏపీకి మంజూరు చేసిన 26 డిస్ట్రిక్ట్ లెవల్ ఖేలో ఇండియా సెంటర్లతోపాటు అదనంగా మరో 26 ఖేలో ఇండియా డిస్ట్రిక్ట్ లెవల్ సెంటర్లను మంజూరు చేయాలని ఆకాంక్షించారు.

అలాగే తిరుపతిలోని ఖేలో ఇండియా రెసిడెన్సియల్ సెంటర్‌లో అథ్లెటిక్స్, రెజ్లింగ్ విభాగాలకు సంబంధించిన సెంటర్లను ఏర్పాటు చేయాలని, కోవిడ్‌కు ముందు నిలిపివేసిన క్రీడాకారుల రైల్వే రాయితీలను పునఃప్రారంభించాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మాండవ్యను శాప్ ఛైర్మన్ కోరారు. నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈసారి ఆ గేమ్స్‌ను ఏపీకి కేటాయించాల్సిందిగా ఆశించారు. దీనిపై కేంద్రమంత్రి మాండవ్య కూడా సానుకూలంగా స్పందించారని శాప్ ఛైర్మన్ వెల్లడించారు.

### ఏపీలో లైఫ్ సేవింగ్ కోర్సు ఏర్పాటు చేయాలి

ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు కలిశారు. అమలాపురం ఎంపీ జీఎమ్ హరీష్, విజయ నగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, లైఫ్ సేవింగ్ స్పోర్ట్స్ కమిషన్ ఛైర్మన్ ప్రదీప్ నాయుడులతో కలిసి క్రీడారంగ అంశాలపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో ఆయన భేటీ అయ్యారు. ఏపీ నూతన స్పోర్ట్స్ పాలసీలో భాగంగా రాష్ట్రంలో క్రీడావసతుల ఏర్పాటుకు 10శాతం సీఎస్ఆర్ నిధులను సమకూర్చేందుకు సహకరించాలని మంత్రి రామ్మోహన్‌నాయుడుని శాప్ ఛైర్మన్ కోరారు.

క్రీడా వసతులు, సదుపాయాలు, స్పోర్ట్స్ అకాడమీల ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులు ఉపయోగపడతాయన్నారు. ఎయిర్‌లైన్ ఆపరేటింగ్ కంపెనీల నుంచి స్పోర్ట్స్ పాలసీకి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని విన్నవించారు. ఎయిర్ హోస్టర్స్, ఎయిర్ గ్రౌండ్ స్టాఫ్‌కు లైఫ్ సేవింగ్‌పై రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ(ఇండియా) ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో లైఫ్ సేవింగ్ కోర్సు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై రామ్మోహన్‌నాయుడు కూడా సానుకూలంగా స్పందించి తప్పకుండా అమలు చేద్దామని హామీ ఇవ్వడం పట్ల శాప్ ఛైర్మన్ హర్షం వ్యక్తం చేశారు.

### లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన శాప్ ఛైర్మన్

ఢిల్లీ పర్యటన సందర్భంగా పార్లమెంటులోని స్పీకర్ కార్యాల యంలో లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా గారిని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తో కలిసి శాప్ ఛైర్మన్ రవినాయుడు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం ఏపీలో అమలు చేస్తున్న క్రీడాపాలసీ గురించి వివరించడం జరిగింది.



### ఏపీలో వాటర్ స్పోర్ట్స్‌ను ప్రోత్సహించాలి

ఆంధ్రప్రదేశ్‌లో వాటర్ స్పోర్ట్స్‌ను ప్రోత్సహించాలని, వాటర్స్ గేమ్స్ నిర్వహణకు విశాఖపట్టణం అనుకూలంగా ఉంటుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆకాంక్షించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా స్పోర్ట్స్ సర్వీసెస్ కంట్రోల్ బోర్డు సెక్రటరీ టు మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ కమోడర్ వరుణ్ సింగ్ ని శాప్ ఛైర్మన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఏపీలో కెనాయింగ్ అండ్ కాయాకింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, దానికి కావాల్సిన నీటి వనరులను గుర్తించామని రవినాయుడు వివరించారు.

త్వరలోనే దీనిపై చర్చిద్దామని, అలాగే ఎన్‌సీసీ నుంచి పూర్తి సహకారం అందిస్తామని వరుణ్ సింగ్ బదులిచ్చారు. అనంతరం ఈఈపీసీ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ దీపక్ ఠాకూర్ ని శాప్ ఛైర్మన్ కలిసి ఆంధ్రప్రదేశ్‌కు సీఎస్ఆర్ ఫండ్స్‌ను కేటాయించాలని కోరగా ఆయన కూడా సానుకూలంగా స్పందించారు.

## పేదల భూ హక్కులను కాపాడేందుకే భూ భారతి-2024

మొదటి పేజీ తరువాయి..

మల్లు స్వరాజ్యం, భీం రెడ్డి నర్సింహారెడ్డి,చాకలి ఐలమ్మ లాంటి వారు పోరాటాలు చేసింది భూమి కోసమే. ఈ భూమిని ఆత్మగౌరవంగా, హక్కుగా భావించారు. భూమినే తమ హక్కుగా భావించి సాయుధ రైతాంగ పోరాటం చేశారు..అధికారంతో, అహంకారంతో ఆధిపత్యాన్ని చెలాయించాలని చూసినా భూమిని కాపాడుకోవడంలో వారు విజయం సాధించారు.

ఆ తర్వాత ఎప్పుడు ఏ ఉద్యమం వచ్చినా.. భూమి చుట్టూనే పోరాటాలు జరిగాయి. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుకు కూడా కొంతమంది భూమిపై ఆధిపత్యం చాలాయించడమే కారణం. యజమాని హక్కులను కాపాడేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయి.

భూమిలేని పేదలకు అసైన్డ్ పట్టాలు ఇచ్చి ఇందిరాగాంధీ పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు. నిజమైన భూ యజమాని హక్కులను కాపాడాలి. లేకపోతే చదువులేని వారి భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు వీలైనంత మేరకు ప్రజలకు ఉపయోగపడేలా చట్టాలు సవరించాయి.

తన మెదడును రంగరించి మాజీ సీఎం కేసీఆర్ ఒక అద్భుత చట్టాన్ని తీసుకొస్తున్నామని ఆనాడు సభలో చెప్పారు.ధరణి పోర్టల్ కేసీఆర్ సొంతంగా కనిపెట్టింది కాదు. 2010లోనే ఒడిస్సాలో ఈ-ధరణి పేరుతో IL&FS కంపెనీకి అప్పగించింది. అనుభవం, నైపుణ్యం లేని సంస్థకు ఈ-ధరణి పోర్టల్ ఇవ్వడాన్ని 2014లో కాగ్ తప్పు పట్టింది. అలాంటి లోపభూయిష్టమైన ధరణిని కేసీఆర్ ఎందుకు తెలంగాణ ప్రజలపై రుద్దారో చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది.

2018లో IL&FSతో పాటు గాదె శ్రీధర్ కు చెందిన e centric, wissen infotech సంయుక్తంగా కాంట్రాక్టు సాధించుకున్నాయి. క్రిమినల్ నేపథ్యం ఉన్న కంపెనీలను టెండర్లలో నిషేధించే విధానం ఉంది. కానీ కేసీఆర్ ఆ పని చేయలేదు. భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అన్ని రకాల బాధ్యతలు ఆ కంపెనీకి అప్పగించారు. ఆ తరువాత IL&FS సబ్సిడరీ కంపెనీ అయిన టెరాసిస్ ధరణి కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ టెర్రాసిస్ లో 99 శాతం షేర్లు ఫిలిప్పిన్స్ దేశానికి చెందిన Falcon SG అనే సంస్థ రెండు దఫాలుగా 2021 లో కొనుగోలు చేసింది. మిగిలిన ఒక్క శాతం వాటా మాత్రం కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్ రాజు కొనుగోలు చేశారు.

ఆ ఒక్క శాతం షేరుతో శ్రీధర్ రాజు టెరాసిస్ కు సీఈవోగా అవతారం ఎత్తారు. Falcon SG (ఫిలిప్పిన్స్) సంస్థలోని 100 శాతం షేర్లు సింగపూర్‌కు చెందిన Falcon investments (Singapore) అనే సంస్థ కొనుగోలు చేసింది. ఈ సింగపూర్ బేస్డ్ కంపెనీలో 100 శాతం వాటాను ఐదు కంపెనీలు కొనుగోలు చేశాయి. Sparrow investments, GW sky, HILL brooks investments, PARADIGME INNVOVATIONS, Quantela INC, Falcon investments



(Singapore) . మళ్లీ ఇందులో Sparrow investments అనే సంస్థలో 100 శాతం వాటాలను gate way fund -2 అనే కంపెని చేతుల్లోకి వెళ్లాయి.

ఆ కంపెనీ మూలాలు ఎక్కడ అన్నది గమనిస్తే... పన్ను ఎగవేతలకు, ఆర్థిక నేరాలకు స్వర్గధామంగా పేరుగాంచిన Caymans island అనే దీవిలో ఉన్నాయి. ఐదింటిలో మరో కంపెనీ అయిన HILL brooks investments మూలాలు కూడా పన్ను ఎగవేత, ఆర్థిక నేరాలకు స్వర్గధామంగా భావించే బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్‌లో ఉన్నాయి. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న వారిలో ఎవరూ ఈ దేశానికి చెందిన వ్యక్తులు కాదు. అలాంటి వ్యక్తుల చేతుల్లోకి తెలంగాణ రైతుల భూముల వివరాలు పెట్టారు.

రెవెన్యూ డిపార్ట్ మెంట్, భూ యజమానికి మధ్య ఉండాల్సిన డేటాను డిజిటల్ పోర్టల్ నెపంతో ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టారు. ఇతర దేశాల్లో ఆర్థిక నేరాల్లో ఇరుక్కుపోయిన సంస్థలకు అప్పగించి.. రైతుల సంపూర్ణ డేటాను వాళ్ల చేతుల్లో పెట్టారు. ఇది ఎంత తీవ్రమైన నేరమో ఒక్కసారి ఆలోచించాలి. ప్రజలకు ద్రోహం చేసి, మోసం చేసి సంపూర్ణ సమాచారాన్ని విదేశీ కంపెనీలకు అప్పగించారంటే.. దీనిపై ఎలాంటి విచారణ చేయాలో తెలంగాణ ప్రజలు ఆలోచించాలి.

ఎంసీహెచ్‌ఆర్డీలో అద్భుతమైన సాంకేతిక ఉంది. ఇతర రాష్ట్రాలకు మన సాంకేతికతను అందిస్తున్న పరిస్థితుల్లో వీళ్లు విదేశీ కంపెనీలకు అప్పగించారు. కేసీఆర్ ఆవేశంతో ఊగిపోతుంటే ఆనాడు నాకు అర్థం కాలేదు. ధరణిలో ఎన్నో ఎకరాల భూదాన్ భూములు, ప్రయివేట్ భూముల యజమానుల పేర్లు మారాయి. అగ్రిమెంట్ లోని 9.20 క్లాజ్ ప్రకారం యజమాని పేరు మార్చడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. 9.20.4 క్లాజ్‌లో పేర్కొన్నట్లు ప్రభుత్వ ఆఫీసులో ఉండి పనులు చేయాలి.

రెవెన్యూ శాఖకు సంబంధించిన సీసీఎల్ఏ కార్యాలయం నుంచి పని చేయాలి. తెలంగాణలో కాకుండా విజయవాడలో, బెంగుళూరుకు, ఈశాన్య రాష్ట్రాల నుంచి ధరణిని నిర్వహించారు. ఈ రాష్ట్రంలో,ఈ దేశంలో లేని కంపెనీలకు, విదేశీయులకు అప్పగించి ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. దీనిపై ఎంత కఠినమైన శిక్ష వేయాల్సిన అవసరం ఉందో ఆలోచన చేయాలి.

గోప్యంగా ఉంచాల్సిన సమాచారం ఆ వ్యక్తికి తెలియకుండా ఎవరికీ ఇవ్వొద్దని చట్టాలు చెబుతున్నాయి. కానీ కేసీఆర్, కేటీఆర్ ఇతర దేశాల వ్యక్తులకు ఈ సమాచారం అప్పగించారు. ఇంత ఎంత తీవ్రమైన నేరం? ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లేందుకు చాలా సమావేశాలు నిర్వహించి భూ భారతి చట్టాన్ని సభ ముందుకు తీసుకొచ్చింది. ధరణిలో పగలు జరగాల్సిన రిజిస్ట్రేషన్ లు అర్ధరాత్రి కూడా జరిగాయి. అర్ధరాత్రి రిజిస్ట్రేషన్ లు చేసే వ్యవస్థ ఏ రాష్ట్రంలోనైనా ఉందా?

బండారం బయటపడుతుందనే ఇవాళ చర్చ జరగకుండా ప్రయత్నాలు చేశారు. ఆనాడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫిర్యాదు చేసినా లెక్కచేయకుండా, తిమ్మాపూర్ భూదాన్ భూములను ప్రైవేటు వ్యక్తుల పేరుకు మార్చారు. మా ప్రభుత్వం వచ్చాక కేసులు నమోదు చేశాము. రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో వేల ఎకరాల భూములను బదిలీ చేశారు. ఎక్కడి నుంచైనా, ఏ పేరుకైనా మార్చేలా స్వైర విహారంచేసే అధికారం సంస్థకు అప్పగించారు.

ధరణి అద్భుతమైతే సభలో ఉండి మమ్మల్ని నిలదీయాలి కదా? 80 వేల పుస్తకాల జ్ఞానంతో సృష్టించిన ధరణి గురించి సంపూర్ణంగా వివరించచ్చు కదా? ఎట్టి పరిస్థితుల్లో చర్చ జరగొద్దని తొండి చేయాలని ప్రయత్నించి వెళ్లిపోయారు. ఈ కార్ రేస్ సంస్థ్ కు చెందిన వ్యక్తి అపాయింట్ మెంట్ అడిగితే నేనే ఇచ్చా. వారు చెప్పాకే వ్యవహారం ఏంటనేది అధికారులతో తెలుసుకున్నా.


ఏసీబీ విచారణ చేస్తున్న సమయంలో, కోర్టులో వాదనలు వినిపిస్తున్న సమయంలో విచారణాధికారులు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని అడ్వాంటేజ్ తీసుకుంటారని దీనిపై ఎక్కువ మాట్లాడటం లేదు. 2023 డిసెంబర్ నుంచి 2024 వరకు జరిగిన అన్ని వివరాలను ప్రజలకు అందిస్తా..

ఈ కార్ రేస్ పై ఏడాదిగా చర్చ జరుగుతున్నా. అసెంబ్లీలో నాలుగు సమావేశాల్లో ఎప్పుడైనా దీని గురించి ఎప్పుడైనా మాట్లాడారా? నిన్నటి నుంచి చర్చ జరగాల్సిందే అని పట్టుబడుతున్నారు. ఎందుకీ అహంకారం? ఏడాదిగా అవసరంలేని చర్చ ధరణి గురించి చర్చ వచ్చిపుడే ఎందుకు? కుట్రపూరిత ఆలోచనతోనే చర్చ జరగకూడదని ప్రయత్నించారు.

ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి ఎప్పుడు పిలిచినా ఇక్కడైన, ఎక్కడైనా.. చివరకు వాళ్ల పార్టీ ఆఫీసులోనైన చర్చకు సిద్ధం. 55 కోట్లు చిన్న అమౌంటా? మేం ఒప్పుకోకపోవడం వల్లే ప్రభుత్వం 600 కోట్ల నష్టపోకుండా ఆపగలిగాం. డ్రగ్స్‌తో పట్టుబడితే ఇంట్లో పార్టీ చేసుకోవద్దా అని దబాయిస్తున్నారు.మనం ఏ సాంప్రదాయంలో ఉన్నాం? ఔటర్ రింగ్ రోడ్ అమ్ముకున్న, హెచ్‌ఎండీఏ ఖిల్లా నుంచి కోట్లు బదిలీ చేసినా ఏమీ అనొద్దు అన్నట్లుగా బీఆరెస్ తీరు ఉంది. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామనే తీరుగా బీఆరెస్ ప్రవర్తన ఉంది. దీన్ని ప్రభుత్వం ఏ మాత్రం సహించదు..

మీరు కూడా కొరడా ఝుళిపించాల్సిన సమయం వచ్చినట్టుంది అధ్యక్షా. హరీష్ రావు పరిస్థితి మాకు అర్థమైంది. చొక్కాలు చించుకోకపోతే ఇంటి దగ్గర కొరడా దెబ్బలు ఉంటాయి. ప్రజల కోసం కొన్ని కొరడా దెబ్బలు తినాలి. మరీ మామకు అంత విశ్వాసం చూపాల్సిన అవసరం లేదు. పేదల భూ హక్కులను కాపాడేందుకే భూ భారతి-2024.

జనం గుండె చప్పుడు
# మహానాడు
8
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 21, డిసెంబర్ 2024 ‖



అనపర్తి మండలం రామవరంలో అనపర్తి యూనిట్ పేషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "రాష్ట్ర ప్రభుత్వ పేషనర్స్ అసోసియేషన్ వారి క్యాలెండర్"ను ఆవిష్కరించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.ఈ కార్యక్రమంలో అనపర్తి యూనిట్ పేషనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో వరంగల్‌కు చెందిన ఫ్రీడమ్ ఫైటర్ టి.జానాబాయ్‌కు అభివాదం చేస్తున్న రాష్ట్రపతి శ్రీ ద్రౌపది ముర్ము







# 3 దశల్లో మన్యం రోడ్ల అభివృద్ధి

- ఎండనకా.. వాననకా గిరిపుత్రుల కోసం పని చేస్తా..
- పర్యాటకంగా గిరిసీమలు
- ఇదే కూటమి ప్రభుత్వం ప్రణాళిక
- యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు
- గిరిజనుల పాట్లు స్వయంగా తెలుసుకొనేందుకే కొండపైకి నడిచి వెళ్ళా
- గత ప్రభుత్వంలో గిరిజనుల కోసం ఒక్క పనీ చేయలేదు
- రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టారుగానీ మన్యంలో కనీసం రోడ్డు కూడా వేయలేదు
- అప్పులు, తాకట్టులతో ప్రజాధనం వృథా చేశారు
- గిరిజన ప్రాంతాల్లో ప్రతి రెండు నెలలకోసారి పర్యటన
- సాలూరు నియోజకవర్గంలో బాగుజోల - సిరివర రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం గిరిజనులతో మాట్లాడిన
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**సాలూరు, మహానాడు:** 'దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు అయినా ఇప్పటికీ గిరిజన ప్రాంతాల్లో సరైన రోడ్డు సౌకర్యాలు లేకపోవడంతో సకాలంలో వైద్య సదుపాయం అందక అడవి బిడ్డలు మృత్యువాత పడడం కలిచివేసే విషయం. గిరిజనుల ప్రాణాలన్నా, వారి సంక్షేమమన్నా గత పాలకులకు ఎందుకో నిర్లక్ష్యం ఆవహించింది. గత ఐదేళ్ల పాలనలో గిరిజన అభివృద్ధికి దృష్టి పెట్టింది లేదు. రుషికొండ ప్యాలస్ ను రూ. 500 కోట్లతో నిర్మించడం, వెనకబడిన జిల్లాలకు చెందాల్సిన నిధులను పక్కదారి పట్టించడం తప్పితే ఇక్కడ అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా విస్మరించార'ని ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు.

గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ నిరక్ష్యరాస్యత, పేదరికం, ఆకలికేకలు, అనారోగ్యం వంటి అంశాలు పట్టి పీడుస్తున్నాయన్నారు. ప్రజలకు ఎంతో బాధ్యతగా కొత్త మార్పు కోసం సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో రెండు నెలలకు ఒకసారి కచ్చితంగా పర్యటించి క్షేత్రస్థాయి పర్యటన చేసి సమస్యలు తెలుసుకుంటానని స్పష్టం చేశారు. సాలూరు నియోజకవర్గం మక్కువ మండలం బాగుజోల నుంచి సిరివర గ్రామం వరకు రూ. 9 కోట్లతో తారు రోడ్డు నిర్మించే పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం పంచాయతీరాజ్ శాఖ ఉపాధి హామీ నిధులతో ఏజెన్సీ ప్రాంతంలో నిర్మించబోయే రోడ్లకు సంబంధించిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. శంకుస్థాపన చేసిన ప్రదేశం నుంచి సిరివర వెళ్ళే కొండప్రాంతం మీదకు ఉన్న కచ్చా రోడ్డును పరిశీలించేందుకు కాలినడకన వెళ్లారు. స్వయంగా గిరిజన నివాస ప్రాంతాలకు వెళ్ళి వారితో మాట్లాడారు. అనంతరం బాగుజోలకు వచ్చి గిరిజనులతో మాటామంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "మనసుంటే మార్గం ఉంటుంది. అడవి, కొండలను నమ్ముకొని జీవించే గిరిపుత్రుల కష్టాలు తీర్చాలనే ఆలోచన ఉంటే కచ్చితంగా ఏదో ఒక మార్గం కనిపిస్తుంది. గత ప్రభుత్వం ఏనాడు గిరిజనుల అభ్యున్నతి, అభివృద్ధిపై దృష్టి పెట్టింది లేదు.

విశాఖపట్నంలో విలువైన ఆస్తులను తాకట్టు పెట్టి వేల కోట్లు అప్పులు తెచ్చారు. ఆ సొమ్ములు మళ్లించారు. రుషికొండ ప్యాలస్‌కు విలువైన ప్రజాధనం వెచ్చింది వృథా చేశారు. గిరిజన గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేదు. రాష్ట్ర విభజన చట్టంలో వెనుకబడిన గ్రామాలకు సంబంధించి తీసుకొచ్చిన రూ.690 కోట్లు ఎక్కడికి వెళ్లాయో తెలియదు. ఏనాడు గిరిజన ప్రాంతాల్లో ఒక్కసారి కూడా గత పాలకులు సందర్శించిందే లేదు. గిరిజనుల బతుకులు, వారి వెతలు తెలుసుకున్నదే లేదు. నేను వెంటనే అద్భుతాలు చేస్తానని చెప్పటం లేదు. ఒక సంవత్సరం సమయం నాకు ఇవ్వండి. గిరిజన ప్రాంతాల్లో మార్పు అనేది కచ్చితంగా చూపిస్తాను. మేము పాలన ప్రారంభించిన ఆరు నెలలకే గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. గిరిజన ప్రజల కోసం ఎండనకా... వాననాకా పనిచేస్తానని మాటిస్తున్నాను.

**పర్యాటక అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి**

నేటి యువతే రేపటి భవిష్యత్తు. యువత ప్రతి అంశంలోనూ నైపుణ్యం పెంచుకోవాలి. ఇక్కడి ప్రకృతి రమణీయత చూస్తే నాకే ఆశ్చర్యం కలుగుతోంది. ఇలాంటి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే యువతకు బోలేడు ఉపాధి కలుగుతుంది. పర్యాటకులు, ప్రకృతిపై అధ్యయనం చేసేవారు ఇటుగా వస్తే గిరిజనుల జీవన శైలి మెరుగవుతుంది. టూరిజం ద్వారా జీవన స్థితిగతులు మెరుగవుతాయి. దీనికోసం ఆలోచన చేస్తామని పవన్ అన్నారు. ఇంత అద్భుతమైన ప్రదేశాన్ని జీవనోపాధి కేంద్రంగా తయారు చేస్తాం. నేను మాటలు చెప్పే మనిషిని కాదు. దీనిపై ఒక ప్రత్యేకమైన ప్రణాళికతో పకడ్బందీగా ముందుకు వెళ్లే ఆలోచన చేస్తాం. ఇక్కడి వనరులు, వ్యవసాయఫలాలు స్థానికులకు దక్కేలా ప్రయత్నం చేస్తాం. హోంస్టే ఏర్పాట్లతోపాటు ప్రకృతిని ఆస్వాదించే టూరిజానికి ప్రోత్సాహం అందించడం ద్వారా మరింత ముందుకు వెళ్లొచ్చు.

**రోడ్ల నాణ్యతపై యువత దృష్టి పెట్టండి**

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం. ప్రజాఖజానా నుంచి ఖర్చు పెట్టే ప్రతి రూపాయలు సద్వినియోగం అవ్వాలి. వేస్తున్న రోడ్లు, కడుతున్న భవనాలు ఏదైనా సరే నాణ్యత లోపాలతో ఉంటే కచ్చితంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. ప్రస్తుతం వేస్తున్న రోడ్ల నాణ్యత విషయంలో యువత పరిశీలన అనేది అవసరం. వారు నిరంతరం అభివృద్ధిపై దృష్టి సారిస్తూ పనుల నాణ్యత విషయంలో దృష్టి పెట్టాలి. ఉత్తరాంధ్ర దోపిడీలకు ఎదురు తిరిగిన నేల. తెలుగు వాడుక భాషకు శ్రీకారం చుట్టిన నేల. మీరు నాకు పూర్తిస్థాయిలో సహకరించండి. అందరం కలసి సమష్టిగా మార్పు కోసం ప్రయత్నిద్దాం. మీ కోసం పనిచేసే వాడు ఒకడు కావాలి. అది నేనే అవుతా.

**ముఖ్యమంత్రి నాయకత్వంలో బలంగా పనిచేస్తాం**

ఇటీవలే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి గారితో ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం విషయంలో చర్చించాం. వెంటనే ఆయన ఆమోదించి, రోడ్ల నిర్మాణానికి అంగీకరించారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం సంపూర్ణంగా పని చేస్తుంది. ఇప్పుడు కూడా నేను కొండ ప్రాంతాల్లో, బురద రోడ్ల మీద నడుచుకుంటూ వెళ్లడానికి కారణం ఏంటంటే.. గిరిజనుల వెతలు ప్రత్యక్షంగా తెలుసుకోవాలని వెళ్లాను. డోలీ భుజంపై పెట్టుకొని అంతదూరం నడిచి వెళ్తుంటే వారి పరిస్థితి ఎలా ఉంటుందో స్వయంగా తెలుసుకొనేందుకు నడిచి వెళ్లాను. ప్రజల బాధలు, వెతలు తీర్చేందుకు ప్రాధాన్యమిస్తున్నాము. మూడు విడతల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు వేసేలా ముందుకు వెళ్తున్నాం. 2019లో మీరు నన్ను పరీక్షించారు. నేను నిలబడే ఉన్నాను. కచ్చితంగా ప్రజల కోసం ఎంత కష్టమైనా నిలబడే ఉంటాను. నేను పని చేస్తా... పని చేయిస్తా"నని పవన్ కల్యాణ్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, బోనెల విజయచంద్ర, జగదీశ్వరి, లోకం నాగ మాధవి, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, మాజీ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ మెంబర్ పడాల అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## చిలకల మాడంగి సమస్యలు తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి

**సాలూరు, మహానాడు:** సుమారు కిలోమీటరు దూరం పవన్ కల్యాణ్ కాలినడకన చిలకల మాడంగి కొండపైకి ఎక్కారు. నూతనంగా రహదారి నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూరపాడు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తే ఇబ్బందులు లేకుండా తాము పంటలు పండించుకునే అవకాశం ఉంటుందన్న విషయాన్ని గిరిజన రైతులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. సూరపాడు రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించి మధ్యలో నిలిపివేసినట్టు చెప్పారు. ఈ విషయంపై జిల్లా అధికారులతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. కొండ ఎక్కుతూ అక్కడి నుంచి వ్యూ పాయింట్ తిలకించారు.

**గంజాయి నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరణ**

సాలూరు రేంజ్ అటవీ అధికారులు గంజాయి సాగు నిర్మూలన, రవాణాను నిలువరించడంపై గిరిజనులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. గంజాయి నిర్మూలనకు అటవీశాఖ అధికారులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు.

**థింసా నృత్యం**

చిలకల మాడంగిలో పవన్ కొండ ఎక్కుతూ ఉండగా గిరిపుత్రులు డప్పులు, సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆయనకి స్వాగతం పలుకుతూ ఎదురొచ్చారు. కొండ వాలు వద్ద సిరివరకు చెందిన గిరిజన మహిళలతో కలిసి వారి సంప్రదాయ థింసా నృత్యం చేశారు. గిరిజన మహిళలతో కలసి పదం కలుపుతూ వారిని ఉత్సాహపరిచారు.

**బాగుజోల బేస్ క్యాంప్ వద్ద మొక్కలు నాటిన పవన్**

తిరుగు ప్రయాణంలో బాగుజోల అటవీశాఖ బేస్ క్యాంప్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. కాంపా స్కీమ్‌లో భాగంగా అటవీ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏపీ జాతుల మొక్కలు పెంచుతున్నారు... సాలూరు రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జంతువుల కదలికలు తదితర అంశాలపై ఆరా తీశారు.



**ఘనస్వాగతం పలికిన గిరిపుత్రులు**

పార్వతీపురం మన్యం జిల్లా ఏజెన్సీ ప్రాంత పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి జిల్లా ప్రజలు, గిరిపుత్రులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. గజపతినగరం, రామభద్రపురం, సాలూరు, మామిడిపల్లి, మార్కొండపుట్, ఎర్రసామంతు వలస తదితర ప్రాంతాల్లో ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నీరాజనాలు పలికారు. దారిపొడుగునా జనసేన నినాదాలు చేస్తూ.. పవన్ కల్యాణ్‌కి జేజేలు పలుకుతూ.. పూల వర్షం కురిపించారు. గిరిజన మహిళలు తమ ప్రాంతంలో లభించే పూలతో దండల తయారుచేసి పవన్ కి వేసేందుకు బారులు తీరారు. హారతులతో కొంత మంది మహిళలు ఎదురురాగా, మరికొంత మంది గిరిజన సంప్రదాయాలతో స్వాగతం పలికేందుకు ఆసక్తి చూపారు. జోరువానలోనూ తిరుగు ప్రయాణంలో సైతం జనం మొత్తం రోడ్ల మీద గొడుగులతో బారులు తీరారు. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ పవన్ ముందుకు సాగారు.

## ప్రపంచ ధ్యాన దినోత్సవం 21, డిసెంబర్ 2024

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఉప (UNGA) డిసెంబర్ 21,2024 ప్రపంచ ధ్యాన దినోత్సవంగా గుర్తించడం జీవనశైలి, సామర్థ్యం పెంపొందించడం కోసమే.

**థీమ్: "అంతర్గత శాంతి - ప్రపంచ సామరస్యం"**

**ధ్యానం ప్రాముఖ్యత:**

నేడు ఆధునిక జీవనగమనంలో ఎదురవుతున్న ఒత్తిడి వలన ఒకనాటి విలాసాలు నేడు నిత్యావసరాలుగా మారిపోయి, టెక్నాలజీ వాడకం వల్ల దేహం తన సహజ శక్తులను కోల్పోయి శరీరాలు ఒత్తిడి కేంద్రాలుగా మారిపోయాయి. ధ్యానము వల్ల శారీరక మానసిక ఆధ్యాత్మికమ్యైన అనేక రకాలైన ప్రయోజనాలు కలవు.

అనేక రకాలైన ధ్యాన పద్ధతులను ద్వారా మానసిక ఆరోగ్యం, ఆనందము, ప్రశాంతత పొందడమే మెడిటేషన్ డే ముఖ్య ఉద్దేశం.

ఒత్తిడి మరియు ఆందోళన తగ్గిస్తుంది.కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుంది.




నిద్రను మెరుగుపరుస్తుంది.

ఏకాగ్రత , మరియు అభిజ్ఞా పనితీరును మెరుగుపరుస్తుంది.

వ్యాది నిరోధక వ్యవస్థను పెంపోందిస్తుంది.

గుండె ఆరోగ్యాన్ని అద్భుతంగా కాపాడుతుంది.

శారీరక ఆరోగ్య ప్రయోజనాలు:



దీర్ఘకాలంగా నొప్పిని తగ్గిస్తుంది.

శ్వాసకోశ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

మెదడు పనితీరు మెరుగుపడుతుంది.

మానసిక ప్రయెజనములు:

ఆందోళన డిప్రెషన్ లక్షణాలు తగ్గిస్తుంది.

ఎమోషనల్ బాలెన్స్ కలుగుతుంది.

ధ్యాన సాధన వల్ల స్వీయ అంతర్గత లోతైన అవగాహన, భావోద్వేగ మేధస్సు మెరుగవుతుంది

**ఆధ్యాత్మిక ప్రయోజనాలు:**

అంతర్గత శాంతి, ప్రశాంతత,కరుణ, సానుభూతి, ప్రేమ పూర్వక దయ, తాదాత్మ్యం పరస్పర అనుసంధాన బావాలను పెంపొందిస్తాయి.

డిసెంబర్ 21 ప్రపంచ ధ్యాన దినోత్సవం ముఖ్య ఉద్దేశం ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తులను కనెక్ట్ చేయడానికి, ప్రతిబింబించటానికి ఒక వేదిక అని చెప్పవచ్చు. దీనిని రోజువారీ జీవితంలో అభ్యాసం గా చేర్చడం వ్యక్తుల జీవన శైలిలో మార్పు తేవడం మెరుగైన భావోద్వేగ స్థితిస్తాపకత కోసం.. ప్రపంచ ధ్యాన దినోత్సవం.

## భూ వివాదాలు పరిష్కారమయ్యే వరకు రెవెన్యూ సదస్సులు

- ఈడుపుగల్లు రెవెన్యూ సదస్సులో మంత్రి అనగాని సత్యప్రసాద్



**కంకిపాడు:** ప్రజలు ఎదుర్కొంటున్న భూ వివాదాలు పరిష్కరించేంత వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పిజిఆర్ ద్వారా అందుతున్న సమస్యల్లో 65 శాతం సమస్యలు భూ సంబంధ సమస్యలే ఉంటున్నాయని అన్నారు. శుక్రవారం నాడు క్రిష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాపాల ఫలితంగానే రాష్ట్రంలో భూ వివాదాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. వాటన్నింటనీ తమ కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. రీ సర్వే నిర్వహించడంలోనూ గత ప్రభుత్వం తప్పులు తడకగా వ్యవహరించిందని, అందువల్లే తాము రీ సర్వే నిర్వహి ంచిన గ్రామల్లో సభలు పెడితే పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. తమ ప్రభుత్వం రీ సర్వేను మొదటి నుంచి చేస్తుందని, చాలా పకడ్బందీగా ఎటువంటి తప్పు లకు తావు లేకుండా రీ సర్వే పూర్తి చేస్తామని చెప్పారు.

గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో జరిగిన తప్పుల తోపాటు ఇతర భూ సంబంధ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మొదట 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు జరపాలనుకున్నామని, కానీ ప్రజల ఎదుర్కొంటున్న భూ వివాదాలన్నింటినీ శాశ్వతంగా పరిష్కరించేంత వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.

ఈ నెల ఆరో తేదీ నుండి రెవెన్యూ సదస్సులను ప్రారంభించగా ఇప్పటికే నాలుగు లక్షల మంది ప్రజలు హాజరయ్యారని, లక్షకు పైగా ఫిర్యాదులు ఇచ్చారని తెలిపారు. ప్రజలంతా రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు.

## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- పోలీస్, న్యాయశాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి
- ఫాస్ట్‌ట్రాక్, ప్రత్యేక కోర్టులపై న్యాయ, హోం మంత్రుల సమీక్ష

**అమరావతి:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కోర్టు కేసుల పరిష్కారంపై న్యాయశాఖ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం లోని కాన్ఫరెన్స్‌హాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరుపై ముఖ్య అధికారులతో మంత్రులు సమీక్ష చేశారు.

ఈ సందర్భంగా మంత్రులు ఫరూక్, అనిత మాట్లాడారు. కేసుల తీవ్రతను బట్టి, ఏ ఉద్దేశ్యంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టులు పనిచేస్తున్నాయో అందుకు అనుగుణంగా ఆయా కోర్టుల్లోని కేసులు ఎక్కువ కాలం కొనసాగకుండా వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేట్లుగా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అవసరమైతే రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశానుసారం సమన్వయం తో ముందుకు సాగాలని సూచించారు.

ముఖ్యంగా సంచలన కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయ పరిష్కారానికి టాస్క్ ఫోర్స్ కోర్టు, ప్రత్యేక కోర్టులు మరింత వేగంగా పనిచేయాలని సూచించడం జరిగింది. సమీక్ష సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి జి ప్రతిభా దేవి, హోం శాఖ కార్యదర్శి తదితర ముఖ్యమైన అధికార బృందం పాల్గొన్నారు.



**23న విజయవాడలో క్రిస్మస్ తేనేటి విందు**

విజయవాడలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 23వ తేదీన ప్రభుత్వం తేనేటి విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. లబ్బీపేట ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తేనేటి విందు కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తేనేటి విందు కార్యక్రమానికి క్రైస్తవ కుటుంబ సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

9

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 21, డిసెంబర్ 2024 ||








# పరిశుభ్రతలో పూణే విధానం అనుసరణీయం

- పూణేలో జరుగుతున్న పారిశుధ్య అంశంపై అధ్యయన యాత్రకు వెళ్లిన ఏపీ స్వచాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ బృందం
- అక్కడి పారిశుధ్య తొలగింపు పద్ధతి బాగుందని ప్రశంస
- సీఎం చంద్రబాబుతో మాట్లాడి పూణే విధానం అమలుచేస్తామన్న పట్టాభి

**పూణే:** దేశంలోనీ ప్రముఖ రాష్ట్రాలలో పరిశుభ్రంగా ఉన్న నగరాలలో పారిశుధ్య నిర్వహణ ఎలా జరుగుతుందో అనే విషయంపై అవగాహన పెంచుకుని అక్కడ అవలంబిస్తున్న కార్యాచరణ నీ మన ఆంధ్రప్రదేశ్




రాష్ట్రం లో కూడా తీసుకు రావాలనే ముఖ్య ఉద్దేశంతో ఆంధ్ర ప్రదేశ్ స్వచాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆయన సభ్యుల బృందం గత కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా పర్యటనలు కొనసాగిస్తున్నారు.

ఇందులో భాగంగా మహారాష్ట్రలోని పూణే నగరంలో అవలంబిస్తున్న ఒక వినూత్న పద్ధతి గురించి తెలుసుకున్న పట్టాభిరాం సభ్యుల బృందం, ఈ రోజు అక్కడ పర్యటించింది. పూణే నగనరం లో ర్యాగ్ పికర్స్ (చెత్త ఏరుకునే వారు) గా ఉన్న 8 వేల మంది కలిపి ఒక కోపరేటీవ్ సొసైటీనీ ఏర్పాటు చేసుకుని దానికి "స్వచ్ కోపరేటీవ్ సొసైటీ"అని పేరు పెట్టుకుని, ఇంటి ఇంటికి తిరిగి తడి చెత్తని,పొడి చెత్తని సేకరిస్తున్నారని, అలా వచ్చిన తడి చెత్తని, పొడి చెత్తనీ వేరు చేసి దానిని ట్రాన్స్ఫర్ స్టేషన్స్ కి తరలించి అక్కడి నుంచి ప్రొసెసింగ్ యూనిట్స్ కి పంపించడం ఒక ప్రక్రియగా సాగుతుందని తెలిపారు.

అయితే ఇందులో పొడి చెత్త ద్వారా వచ్చిన ప్లాస్టిక్ కవర్స్,వాటర్ బాటిల్స్,పెట్ బాటిల్స్ తదితర రిసైకిలాబుల్స్ వారు ఏర్పాటు చేసుకున్న స్వచ్ కోపరేటీవ్ సొసైటీ ద్వారా అమ్ముకుని నెలకి 25 వేల రూపాయలకి పైగా సంపాదిస్తున్నారని,ఇది చాలా గొప్ప విషయమని పట్టాభి తెలిపారు. ర్యాగ్ పికర్స్ స్వచ్ కోపరేటీవ్ సొసైటీ డైరెక్టర్ గా ఉన్న విద్యావతి బృందం దగ్గరుండి మరీ తడి చెత్తని,పొడి చెత్తని సేకరించే విదానాన్ని పట్టాభిరామ్ బృందానికి చూపించడం.. అలాగే దాని ద్వారా వచ్చే కోపరేటీవ్ సభ్యులకి వచ్చే ఆదాయ మార్గాల గురించి వివరించడం జరిగిందని పట్టాభి తెలిపారు.

ఇలా కొత్తగా అవలంబిస్తున్న ఈ కార్యక్రమానికి పూణే లో ఉన్న ఎన్జీవో లు కూడా సహకారం అందిస్తున్నారని పట్టాభి తెలిపారు.. ఈ ర్యాగ్ పికర్ (చెత్త ఏరుకునే వారి) లో దాదాపు ఎక్కువమంది మహిళలే ఉన్నారని పట్టాభి తెలిపారు. మన రాష్ట్రం లో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి 25 ఏళ్ల క్రితమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా గ్రూప్స్ తీసుకు వచ్చారని పట్టాభి గుర్తు చేశారు.

పూణే నగరంలో అనుసరిస్తున్న ఈ నూతన పద్ధతి కచ్చితంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కూడా ఉపయోగపడుతుందని, ఇక్కడ జరుగుతున్న విధానాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి వివరించి అవసరం అయితే స్వచ్ కోపరేటీవ్ సొసైటీ బృందాన్ని ఆంధ్ర రాష్ట్రానికి రప్పించి స్వయంగా వారు నడుపుతున్న స్వచ్ కోపరేటీవ్ సొసైటీ గురించి ప్రెజెంటేషన్ తీసుకుంటామని, ఇది కచ్చితంగా రాష్ట్రానికి మేలు చేస్తుందని దీని పై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి తగిన మార్గ దర్శకాలు రూపొందిస్తామని పట్టాభి తెలిపారు..

# బాబూజీ.. ఇదీ మా పనితీరు!

- వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై ముఖ్యమంత్రికి నివేదిక
- ముఖ్య కార్యక్రమాల కింద 12 కొత్త కార్యక్రమాలు... పనితీరు ప్రస్తావన

**అమరావతి:** రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి గత ఆరు నెలలుగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ & వైద్య విద్య శాఖ పనితీరు నివేదికను ఆ శాఖ శుక్రవారంనాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సమర్పించింది. వివిధ ప్రధాన ఆరోగ్య పథకాల కింద కొత్తగా తీసుకొచ్చిన పన్నెండు కార్యక్రమాలు, మెరుగుపడిన పనితీరును ఈ నివేదికలో ప్రధానంగా ప్రస్తావించింది:

1. అందరికి క్యాన్సర్ పరీక్షలు (యూనివర్సల్ క్యాన్సర్ స్క్రీనింగ్): పెరుగుతున్న క్యాన్సర్ కేసులను దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ఏర్పాట్లు చేసిన తర్వాత ఈ ఏడాది నవంబర్ 14న అందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్‌ను ప్రారంభించింది. ఎన్‌సిడి (NCD) 3.0 (నాన్-కమ్యూనికేబుల్ డిసీజ్ సర్వే 3.0) కింద ఇప్పుడు మహిళలల్లో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. మునుపటి ఎన్‌సిడి సర్వేలలో కేవలం రక్తపోటు, మధుమేహం, రెండింటితో బాధపడుతున్న వారికి మాత్రమే పరీక్షలు నిర్వహించేవారు. ఈ సర్వే కింద ఇప్పటివరకు 33,58,347 మందిని పరీక్షించారు. తదుపరి వ్యాధి నిర్ధారణ, చికిత్స నిర్వహించాల్సిన 29,469 మంది క్యాన్సర్ అనుమానిత మహిళలను గుర్తించారు.
2. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె): రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 70 లక్షల మంది విద్యార్థుల్లో వివిధ వ్యాధులు, వైకల్యాలను ముందుగానే గుర్తించి, దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి వీలుగా పరీక్షలు నిర్వహించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత 6 నెలల్లో, 488 శస్త్రచికిత్సలు జరిగాయి, వాటి వివరాలు: 108 చీలిన పెదవులు(క్లెఫ్ట్ లిప్) & చీలిన అంగుడు(క్లెఫ్ట్ పలాటె), 150 పెద్ద కాలు(క్లబ్ ఫుట్), 24 కంబునాడిని తిరిగి అమర్చడం(కాక్లియర్ ఇంప్లాంట్లు), 13 పుట్టుకతో వచ్చే వ్యాధులు, 3 హిప్ డెవలప్‌మెంటల్ డిస్‌ప్లేయా (పిల్లల్లో నడుము, తొడ ఎముకలు సరిగ్గా అతుక్కోకపోవడం)
3. గ్రామీణ, పట్టణాల్లో పేద ప్రజలు వైద్యంపై చేసే ఖర్చును తగ్గించడం కోసం, వారికి 87 రకాల డయాగ్నస్టిక్ టెస్ట్‌లు చేయడానికి విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో 3 సిటీ డయాగ్నస్టిక్ సెంటర్‌లను ఏర్పాటు చేయడానికి చర్యలు ప్రారంభమయ్యాయి.
4. **ఇ-ఐసియు:** మారుమూల, అలాగే గిరిజన ప్రాంత ప్రజల ప్రయోజనం కోసం, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సహకారంతో గోల్డెన్ అవర్(అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయం నుండి తప్పించేందుకు అవకాశమున్న సమయం)లో తక్షణ వైద్య సేవను అందించడానికి ఏరియా హాస్పిటల్‌లో ఈ సర్వీసును తీసుకొచ్చారు. ఒక్కొక్కటి 8 పడకల సామర్థ్యంతో రంపచోడవరం, పార్వతీపురం జిల్లా ఆసుపత్రులు ప్రారంభమయ్యాయి.
5. గుండెకు భరోసా (ఎస్‌టిఇఎమ్‌ఐ (STEMI) ప్రోగ్రామ్) పలు మార్లు ట్రయల్ రన్స్ నిర్వహించిన తర్వాత, గోల్డెన్ అవర్‌లో క్రిటికల్ హార్ట్ కేర్‌ను అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించారు. గుండె కండరాల వ్యాధుల(కార్డియో వాస్కులర్ వ్యాధులు)తో మరణిస్తున్న వారి సంఖ్యను తగ్గించడం కోసం 22 పెద్ద ఆసుపత్రులను హబ్‌లుగా, అలాగే 234 సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులను ఇందులో చేర్చారు. గోల్డెన్ అవర్‌లో మరింత క్లిష్టమైన చికిత్సను అందించడానికి వీలుగా టెనెక్‌ప్లేస్ ఇంజెక్షన్‌ను ఇస్తున్నారు, బహిరంగ మార్కెట్‌లో రూ.45,000 ధర ఉన్న ఈ ఇంజెక్షన్‌ను ఉచితంగా అందించడం విశేషం. ఇలా ఇప్పటివరకు 971 మంది రోగులను ప్రాణాపాయం నుండి రక్షించారు.
6. రోగుల సంరక్షణను మెరుగుపరచడానికి 30 పాయింట్లతో జిజిహెచ్‌లకు కార్యాచరణ ప్రణాళిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో రోగి, సందర్శకులు స్నేహపూర్వక వాతావరణం పొందేలా మార్పులు చేయడానికి, అలాగే సకాలంలో నాణ్యమైన, విస్తృతమైన ఆరోగ్య సంరక్షణ సర్వీసులను అందించడానికి 30 పాయింట్ల కార్యాచరణ ప్రణాళికను మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆగస్టు 13న ప్రకటించారు. అప్పటి నుండి వివిధ కార్యాచరణ అంశాలకు సంబంధించి జిజిహెచ్‌ల పనితీరును ప్రతి నెల ఆయన సమీక్షిస్తున్నారు.



7. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జోక్యం చేసుకుని, కేంద్ర ప్రభుత్వంతో జరిపిన చర్చల ఫలితంగా 2024-25 సంవత్సరానికి ఆయుష్ శాఖ బడ్జెట్ 400 రెట్లు, అంటే రూ.84 కోట్లకు పెరిగింది.
8. విపత్తు సంసిద్ధత, విపత్తు సమయంలో వెంటనే స్పందించేందుకు అవసరమైన ప్రణాళిక కోసం సుమారు రూ.14 కోట్లతో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ - వైజాగ్‌లో రసాయన, జీవ, రేడియోలాజికల్, న్యూక్లియర్ (సిబిఆర్‌ఎన్) మెడికల్ మేనేజ్ మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడమైంది.
9. తృతీయ స్థాయి వైద్య సేవల సౌకర్యాలపై పడుతున్న భారాన్ని, అలాగే ప్రజలు వైద్యం కోసం చేస్తున్న ఖర్చును తగ్గించే ఉద్దేశంతో అత్యవసర శస్త్రచికిత్స, ఇంటెన్సివ్ కేర్ సర్వీసులను నిర్వహించ డానికి జిల్లా స్థాయిలో మొత్తం రూ.230 కోట్లతో, ఒక్కొక్కటి 75 పడకలతో, 10 క్రిటికల్ కేర్ బ్లాక్‌లను ఏర్పాటు చేయడమైంది.
10. మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎమ్‌ఎస్‌యు) ఏర్పాటు: రూ.20 కోట్ల వ్యయంతో జిజిహెచ్ -గుంటూరులో ఎమ్‌ఎస్‌యు ఏర్పాటు చేయడమైంది. ఇది గుంటూరు, విజయవాడ నగరాల్లో వ్యాధి వ్యాప్తిపై రియల్ టైమ్ రిపోర్టింగ్‌తో పాటు వ్యాధి నిఘా కేంద్రంగా పనిచేస్తుంది. వివిధ చోట్ల నుండి ఆరోగ్య సంబంధిత సంఘటనలపై హెచ్చరికలు పంపుతుంది.
11. 25 బోధన, జిల్లా ఆసుపత్రులలో జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటును మొదటి దశలోనే చేయడమైంది, అలాగే గడువులోగా విస్తరించ డంపై దృష్టి సారించడమైంది.
12. వైద్య విద్య స్థితిని ఆరోగ్య మంత్రి సమీక్షించిన తర్వాత... బోధన, మౌలిక సదుపాయాల నాణ్యతను మెరుగుపరచడానికి, అలాగే ఇతర ప్రముఖ వైద్య సంస్థలతో పోటీ పడటం కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్)లో పాల్గొన వలసిందిగా ప్రభుత్వ వైద్య కళాశాలలకు సూచనలు ఇచ్చారు. దీనికి సంబంధించి ప్రభుత్వ వైద్య కళాశాలలు సన్నాహాలు ప్రారంభించాయి.

# ధాన్యం మిల్లుకు చేరిన వెంటనే రైతుల అకౌంట్లో డబ్బులు

- సేకరణలో ఎక్కడా తప్పు జరగడానికి వీల్లేదు.. తేమశాతంలో కచ్చితత్వం ఉండాలి
- పెట్టుబడి తగ్గించి...ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- గంగూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలును పరిశీలించిన సీఎం

**పెనమలూరు,మహానాడు:** ధాన్యం సేకరణలో ఎక్కడా తప్పు జరగడానికి వీల్లేదు, తేమశాతంలో కచ్చితత్వం ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే అకౌంట్లో డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగితే రైతులకు శ్రమ తగ్గడంతో పాటు




ఉత్పత్తిని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు.

పెట్టుబడి తగ్గించి రైతులను అప్పుల ఊబి నుండి బయటకు తీసుకొచ్చి ఉపశమనం కలిగించడంతో పాటు ఆదాయం పెంచాలన్నదే తమ సంకల్పమన్నారు. కృష్ణా జిల్లా, పెనమలూరు నియోజకవర్గం, గంగూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలును పరిశీలించారు. రైతుల నుంచి ధాన్య సేకరణ ఎలా చేస్తున్నారో సీఎంకు రైతు సేవాకేంద్రం సిబ్బంది వివరించారు.

అనంతరం తాము ధాన్యం ఎలా అమ్ముతున్నది సీఎంకు రైతులు వివరించారు. గతేడాది కంటే ఈ ఏడాది పంట ఎక్కువగా వచ్చిందని, మిషన్ కోత వల్ల ఎకరానికి అయిదారు వేలు కలిసి వచ్చిందని రైతులు చెప్పారు. కోసిన గడ్డిని బయోఫ్యూయల్ ప్లాంట్ వాళ్లు తీసుకుంటే మరో రూ.5 వేల వరకూ వస్తుందని రైతులకు సీఎం తెలిపారు. ధాన్యం కొన్న 48 గంటల్లోనే డబ్బులు జమ అవుతున్నాయా అని సీఎం అడగ్గా...డబ్బులు కరెక్టుగానే వస్తున్నాయని రైతులు సమాధానమిచ్చారు.

ప్రొక్యూర్మెంట్‌కు షెడ్యూలింగ్ మొత్తం ఒకటిగా లేదా... వేర్వేరుగా పంట కోత కోస్తే పార్ట్ షెడ్యూలింగ్ ఇస్తామని సిఎంకు సేవాకేంద్రం సిబ్బంది వివరించారు. సాగు చేస్తున్న పొలాన్ని బట్టి రైతుకు దిగుబడి ఎంత వస్తుందో కూడా నమోదు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. అనంతరం ధాన్యం తేమశాతాన్ని ఎలా గణిస్తారో స్వయంగా సీఎం చంద్రబాబు పరిశీలించారు. తేమశాతంలో సేవాకేంద్రం



వద్ద ఎంత రీడింగ్ వస్తే మిల్లులో కూడా అంతే రావాలని, మార్పు వస్తే చర్యలు తీసుకుంటామని సీఎం అన్నారు.

**ఒకరోజు ముందుగానే రైతులకు ధాన్యం డబ్బులు**

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం తేమశాతం పరిశీలించిన అనంతరం మిల్లుకు చేరిన వెంటనే రైతుల అకౌంట్లో డబ్బులు వేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నాం. ఒకరోజు ముందుగానే రైతులకు ధాన్యం డబ్బులు ఇస్తే మరింత సంతోషిస్తారు. క్షేత్రస్థాయిలోకి నేను వచ్చింది రైతులతో మాట్లాడటానికే. మీ సూచనలు, సలహాలు కూడా తీసుకునేందుకు వచ్చాను. ఏ పంట పండిస్తే ఎక్కువ ఆదాయం వస్తుందో రైతులు ఆలోచించుకోవాలి. భూమి, వాతావరణ పరిస్థితులు అంచనా వేసుకుని పంట సాగు చేయాలి. నీళ్లు సరైన సమయంలో ఇవ్వకపోవడంతోనే రైతులు నష్టపోతున్నారు.


అకాల వర్షాలతో అప్పులపాలవుతున్నారు. గత 5 సంవత్సరాలు కాలువల్లో పూడిక తీయలేదు. పట్టిసీమ ద్వారా సకాలంలోనే వరినాట్లకు నీరందిస్తాం. వ్యవసాయం మన సంస్కృతి, వ్యసనం. రైతుకు ఒక్కరోజు పొలం చూడకపోయినా నిద్రరాదు. సొంత భూమిలో చేసినా, కౌలుకు చేసినా రైతులకు ఆదాయం రావాలి. ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు కోరిన విధంగా డ్రయర్ మిషన్లు పొలం వద్దకే పంపే ఏర్పాటు చేస్తాం' అని సీఎం సీఎం అన్నారు.

కాలువలపై ఎంక్రోచ్ మెంట్ ఉండటం వల్ల నీరు సరిగా రావడం లేదని అధికారులు సీఎంకు తెలపగా...వాటిని తీసేయాలని ఆదేశాలు జారీ చేశారు. పంట దిగుబడి సరిగా రాని రైతుకు బెస్ట్ ప్రాక్టీసస్ ఆచరించి పంట దిగుబడి పెంచేలా అధికారులు గైడ్ చేయాలన్నారు. ఏ పంటకు ఎంత డిమాండు ఉంది, మార్కెటింగ్ ఎలాగనేది కూడా రైతులకు అధికారులు చెప్పాలన్నారు. అనంతరం రైతులకు సీఎం చంద్రబాబు టార్పాలిన్ పరదాలు పంపిణీ చేశారు.

# వేగంగా ధాన్యం సేకరణ

మొదటి పేజీ తరువాయి..

ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా వేధించడంతో రైతాంగం బాగా నష్టపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ధాన్యం కొనుగోలు చేసిన కేవలం 48 గంటల్లోనే రైతులకు డబ్బు చెల్లిస్తున్నాం. 93 శాతం మంది రైతులకు 24 గంటల్లోపే



చెల్లించాం. రైతుల నుండి ధాన్యం కొన్నందుకు రూ.4,730 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం. ధాన్యంలో తేమ శాతంలో తేడాలు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. గోతాల్లో నింపిన గింజలు తేమ శాతం పేరుతో వెనక్కి రాకూడదు.' అని అన్నారు.

**సైలోస్ సిస్టంతో అధిక లాభం**

'ధాన్యంలో తేమ శాతం తగ్గించేందుకు వివిధ ప్రాంతాల్లో డ్రైయర్స్ కూడా పెట్టాం. సేకరించిన ధాన్యంలో కేవలం 23 శాతం ధాన్యం మాత్రమే డ్రైయర్స్ ద్వారా ఆరబెడుతున్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలను తప్పకుండా తీసుకుంటాం. గతంలో కంటే రైతులు ఇప్పుడు చాలా ఆనందంగా ఉన్నారు. గతంలో కంటే ఇప్పుడు పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని రైతులే చెప్తున్నారు. గత ప్రభుత్వం సరిగా ధాన్యం కొనుగోలు చేయలేదు... చేసినా సమయానికి డబ్బులు ఇవ్వలేదు.

త్వరలో సైలోస్ సిస్టమ్ కూడా రైతులకు అందుబాటులోకి తీసుకుని రావాలని చూస్తున్నాము. సైలోస్ సిస్టమ్ అందుబాటులోకి వస్తే రైతులు కావాల్సిన సమయంలో పంటను అమ్ముకునే అవకాశం ఉంటుంది. దీంతో నిల్వ పెట్టిన ధాన్యానికి ఎక్కువ రేటు వస్తుంది. ఎంటీయూ 1262 గత ఏడాది కృష్ణా జిల్లాలో 3,582 మెట్రిక్ టన్నులు దిగుబడి ఇస్తే.. ఈ ఏడాది 32,859 మెట్రిక్ టన్నులు దిగుబడిని ఇచ్చింది. ఇతర జిల్లాల్లోనూ ఈ పంట దిగుబడి ఎక్కువగా ఉంది.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ఆకస్మిక తనిఖీలు ఉంటాయి**

'సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించి రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. వినియోగదారుల అవసరాల మేరకు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను పండించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. తక్కువ పెట్టుబడితో రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తాం. పురుగు మందుల వాడకం కూడా తగ్గించాలి. దీని ద్వారా కూడా రైతులకు మంచి




ధర లభిస్తుంది. డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ ఎక్కువవుతోంది.

గతంలో తుఫాన్ సమయంలో పంట చేతికి వచ్చినా సరే పొలాల్లో ఉండిపోయేది. దీంతో పంట కుళ్లిపోయేది. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా అధికారులు చూడాలి. రోడ్లు ఎలా ఉన్నాయో చూస్తాను. ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాను. భవిష్యత్తులో ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తా. రైతులు ఏ మిల్లులో ధాన్యం అమ్ముకోవాలను కుంటే ఆ రైస్ మిల్లులో అమ్ముకోవచ్చు. రైతు అనుకూలతను బట్టి తానే ఎంచుకునే సదుపాయం కల్పిస్తాము. దళారీ వ్యవస్థపై కచ్చితమైన చర్యలుంటాయి. దళారీ వ్యవస్థ ఉండేందుకు వీల్లేదు. గోనె సంచులు ఎక్కడ నుంచి వెళ్లాయో అనే దానిపై కచ్చితంగా ఉంటాం. బియ్యం అక్రమ రవాణాను అరికడతాం. బియ్యం స్మగ్లింగ్, రీసైక్లింగ్ విషయంలో కఠినంగా ఉంటాం' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

# చెప్పు చూపిస్తారా? ఇదేం పద్ధతి?

**- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్**

**హైదరాబాద్:** "ఇవాళ్టి సమావేశాల్లో ఒకే ఒక మంత్రి అసెంబ్లీలో ఉన్నారు. ఆయన భూ భారతి బిల్లు పై చదువుకుంటూ వెళు తున్నారు. రాష్ట్రానికి, దేశానికి ఎంతో ముఖ్యమైన ఫార్ములా ఈ-కార్ రేసింగ్ ఈవెంట్ గురించి మేం స్పీకర్ దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించాం. రేసింగ్‌పై చర్చ పెట్టండి. ఏం జరిగిందో మేం వివరిస్తాం అని చెప్పాం. కానీ కాంగ్రెస్ పార్టీ వైపు నుంచి దాడులు చేశారు. పేపర్లు విసరడమే కాకుండా, చెప్పు తీయడం, బాటిల్ విసరడం వంటి చర్యలకు పాల్పడ్డారు "అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ విరుచుకుపడ్డారు. "మాట్లాడితే చాలు. దళిత స్పీకర్, దళిత



స్పీకర్ అంటున్నారు. అలా అనడం ద్వారా స్పీకర్ ను వారే అవమానిస్తున్నారు. శాసనసభాపతి అంటే అందరికీ గౌరవనీయమైన వ్యక్తి. అలాంటి స్థానంలో ఉన్న వ్యక్తిని అనవసరంగా దళిత స్పీకర్ అని ప్రస్తావిస్తున్నారు. దళితుడ్ని మీరు అవమానించారంటూ విపక్ష సభ్యులపై ఆరోపణలు చేస్తున్నారు. ఇది చాలా పొరపాటు. అక్కడ జరిగిన సబ్జెక్టు ఒకటైతే, మీరు మాట్లాడుతున్నది మరో సబ్జెక్టు" అని తలసాని వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీలో ప్రభుత్వం భూ భారతి బిల్లు తీసుకువచ్చేందుకు ప్రయత్నించగా, విపక్ష బీఆర్‌ఎస్ సభ్యులు ఈ-కార్ రేసింగ్ ఈవెంట్ పై చర్చకు డిమాండ్ చేశారు. దాంతో సభ ముందుకు నడవని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, సభ నుంచి బీఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 21, డిసెంబర్ 2024 ‖



# బాబాయ్..అబ్బాయ్.. బాండింగ్

బాబాయ్.. అబ్బాయ్.. అదేనండీ పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ బాండింగ్ గురించి అందరికీ తెలిసిందే. చిన్నప్పటి నుంచి చరణ్ ను పవన్ బాగా చూసుకుంటారు! మెగాస్టార్ చిరంజీవి తన మూవీ షూటింగ్స్ తో బిజీగా ఉండడం వల్ల.. చరణ్ ఎక్కువగా పవన్ దగ్గరే



పెరిగారు. ఈ విషయాన్ని మెగా ఫ్యామిలీ మెంబర్స్ చాలా సార్లు చెప్పారు. చరణ్ కూడా బాబాయ్ పై ఉన్న తన ఇష్టాన్ని అనేక సార్లు వివిధ సందర్భాల్లో బహిరంగంగా ప్రదర్శించారు. అయితే ఇప్పుడు బాబాయ్.. అబ్బాయ్ కోసం సందడి చేయనున్నారు. రామ్ చరణ్ అప్ కమింగ్ మూవీ గేమ్ ఛేంజర్ ఈవెంట్‌కు చీఫ్ గెస్ట్‌గా రానున్నట్లు తెలుస్తోంది. దీంతో మెగా అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్.. జనవరి 10వ తేదీన రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మేకర్స్ జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు. అమెరికాలోని డల్లాస్ లో ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే చరణ్ అక్కడికి బయలుదేరారు. పుష్ప-2తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సుకుమార్ చీఫ్ గెస్ట్ గా హాజరుకానున్నారు. అయితే రీసెంట్ గా లక్నోలో టీజర్ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించిన మేకర్స్.. చెన్నైలో త్వరలో సందడి చేయనున్నారు. జనవరి మొదటి వారంలో తెలుగు స్టేట్స్ లో ఓ ఈవెంట్ ను నిర్వహిస్తామని ఇప్పటికే గేమ్ ఛేంజర్ నిర్మాత దిల్ రాజు తెలిపారు. ఇప్పుడు ఆ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. జనవరి 4వ తేదీన ఆ వేడుక గ్రాండ్ గా జరగనున్నట్లు సమాచారం.

# ఉత్తమ నటిగా సాయిపల్లవి..
# నటుడిగా విజయ్ సేతుపతి

తమిళ చిత్ర పరిశ్రమ ప్రత్యేకంగా భావించే చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకగా జరిగింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో కోలీవుడ్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు సందడి చేశారు. ఇందులోభాగంగా అమరన్ చిత్రానికి ఉత్తమ నటిగా సాయిపల్లవి, 'మహారాజ' చిత్రానికి ఉత్తమ నటుడిగా విజయ్ సేతుపతి అవార్డులు అందుకున్నారు. ఈ విజయంపై సాయిపల్లవి ఆనందం వ్యక్తంచేశారు.




"22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నందుకు నాకెంతో సంతోషం, గర్వంగా ఉంది. ఎందుకంటే, ఈ ఏడాది ఎన్నో గొప్ప చిత్రాలు విడుదలయ్యాయి. ఎంతో పోటీ నెలకొంది. అలాంటి సమయంలో ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. నా అభిమానులకు ధన్య వాదాలు. వారు చూపించే ప్రేమ నన్నెంతో భావోద్వేగానికి గురి చేస్తుంటుంది. ముకుంద్ కుటుంబసభ్యులు, ఆయన భార్య వల్లే ఇది సాధ్యమైంది. ఈ కథను ప్రపంచానికి చెప్పడానికి వాళ్లు అంగీకరించడం వల్లనే దీనిని రూపొందించగలిగాం. దేశం కోసం నిరంతరం శ్రమిస్తోన్న ఒక జవాను కథ ఇది. రాజ్‌కుమార్ పెరియాసామి వంటి దర్శకులే ఇలాంటి మరెన్నో కథలు మనకు అందించగలరు" అని సాయిపల్లవి తెలిపారు. తాను అవార్డు అందుకోవడంపై విజయ్ సేతుపతి ఆనందం వ్యక్తంచేశారు. 'మహారాజ'ను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు.

**విజేతలు వీరే:**

ఉత్తమ చిత్రం: అమరన్
రెండో ఉత్తమ చిత్రం: లబ్బర్ పందు
ఉత్తమ నటుడు : విజయ్ సేతుపతి (మహారాజ)
ఉత్తమ నటి: సాయిపల్లవి (అమరన్)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: సీహెచ్ సాయి (అమరన్)
ఉత్తమ ఎడిటర్: ఫిలోమిన్ రాజ్ (అమరన్)
ఉత్తమ బాలనటుడు: పొన్వెల్ (వాళై)
ఉత్తమ సహాయనటుడు: దినేశ్ (లబ్బర్ పందు)
ఉత్తమ సహాయనటి: దుషారా విజయన్ (వేట్టయన్)
ఉత్తమ రచయిత: నిథిలన్ సామినాథన్ (మహారాజ)
ఉత్తమ సంగీత దర్శకుడు: జీవీ ప్రకాశ్ (అమరన్)
స్పెషల్ జ్యూరీ అవార్డు : మారి సెల్వరాజ్ (వాళై), పా.రంజిత్ (తంగలాన్)

# 'శంబాల' రెగ్యులర్ షూటింగ్

ప్రస్తుతం మేకర్లు అంతా ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నారు. ఆ నూతన ప్రపంచంలోకి ఆడియెన్స్‌ను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.



కాల్పనిక ప్రపంచంలో జరిగే అద్భుతమైన ఘట్టాల్ని చూసి ఆడియెన్స్ థ్రిల్ అవుతున్నారు. ఈ క్రమంలోనే ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లేలా 'శంబాల' చిత్రాన్ని తీస్తున్నారు. డిఫరెంట్ సబ్జెక్టులతో ప్రయోగాలు చేస్తున్న ఆది సాయి కుమార్ హీరోగా.. 'ఏ' యాడ్ ఇన్ఫినిటిమ్ ఫేమ్ డైరెక్టర్ యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న చిత్రం 'శంబాల'. శంబాల చిత్రంలో ఆది సాయి కుమార్ జియో సైంటిస్ట్‌గా కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభం అయింది. ఈ చిత్రంలో ఆది సాయికుమార్ సరసన అర్చన అయ్యర్ కథానాయికగా నటించనున్నారు. సూర్య 45వ చిత్రంలో భాగమైన శ్వాసిక కీలక పాత్ర పోషిస్తుండగా.. రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఇండియన్ స్క్రీన్ మీద ఇది వరకెన్నడూ టచ్ చేయని పాయింట్, కథతో ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ పొందిన యుగంధర్ ముని హాలీవుడ్ స్థాయి నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో శంబాల చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి ఖర్చులకు రాజీ పడకుండా భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ముఖ్యంగా విజువల్స్, సాంకేతికత అత్యున్నత స్థాయిలో ఉండేలా చూసుకుంటున్నారు.

# ఈవిల్డోర్‌గా
# సోహైల్ ఖాన్



నందమూరి కళ్యాణ్ రామ్ అప్ కమింగ్ యాక్షన్ థ్రిల్లర్ చనందమూరికళ్యాణ్‌రామ్21 షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ హై-ఆక్టేన్ మూవీ యాక్షన్, ఎమోషనల్ డెప్త్ బ్లెండ్ తో ఉండబోతోంది. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న చనందమూరికళ్యాణ్‌రామ్21 ప్రేక్షకులకు థ్రిల్లింగ్ రైడ్ ఇవ్వబోతోంది. ఈ చిత్రంతో టాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తున్న సోహైల్ ఖాన్ ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. స్టన్నింగ్ పోస్టర్‌లో సొహైల్ ఖాన్ బ్లాండ్ అండ్ బ్లాక్ లో గ్లాసెస్ ధరించి స్టైలిష్ పవర్ ఫుల్ ప్రెజన్స్ తో కనిపించారు. ఈవిల్డోర్ గా అతని పాత్ర హైలైట్‌గా ఉంటుంది. ముఖ్యంగా హీరోతో పేస్ అఫ్ రివర్టింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతుండగా, కళ్యాణ్ రామ్ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. విజయశాంతి కీలక పాత్రలో నటిస్తుండగా, శ్రీకాంత్, సాయి మంజేరకర్, యానిమల్ పృథ్వీవీరాజ్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

# "డ్రింకర్ సాయి"లో బాగీ క్యారెక్టర్‌కు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు - హీరోయిన్ ఐశ్వర్య శర్మ



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "డ్రింకర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నెల 27న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "డ్రింకర్ సాయి" సినిమా హైలైట్స్ హీరోయిన్ ఐశ్వర్య శర్మ తెలిపారు."డ్రింకర్ సాయి" సినిమాలో నా క్యారెక్టర్ పేరు బాగీ. ఈ కథ విన్నప్పుడు నాది చాలా బలమైన క్యారెక్టర్ అనిపించింది. ఈ క్యారెక్టర్ ను జెన్యూన్ గా ప్రెజెంట్ చేయాలని బాధ్యతగా ఫీలయ్యాను. నటిగా నాకు ఛాలెంజింగ్ గా అనిపించింది. ఈ సినిమా కోసం ఆడిషన్స్ ఇచ్చాను. కొన్ని సీన్స్ ఇస్తే చేసి చూపించాను. అందులో పర్ ఫార్మెన్స్ నచ్చి ప్రాజెక్ట్ లోకి తీసుకున్నారు. బాగీ క్యారెక్టర్ కు మీరు బాగా కనెక్ట్ అవుతారు. మా నాన్న స్టేజ్ యాక్టర్. నాపైనా ఆ ప్రభావం తెలియకుండానే పడింది. చిన్నప్పటి నుంచి ఆర్టిస్టుగానే ఉండాలనుకున్నాను. డ్యాన్సర్, సింగర్ కావాలనేది నా కోరిక. ఈ ఫీల్డ్ లోకి రాకుంటే ఫలానా జాబ్ చేయాలనే ఆప్షన్ కూడా పెట్టుకోలేదు. 12 క్లాస్ పూర్తయిన తర్వాత జమ్మూ నుంచి ముంబై వచ్చి యాక్టింగ్ కోర్సులో జాయిన్ అయ్యాను. యాక్టింగ్ కోర్సు పూర్తయ్యాక ఆడిషన్స్ ఇవ్వడం ప్రారంభించాను. గతంలో షార్ట్ ఫిలింస్, వెబ్ సిరీస్ లలో నటించలేదు. కొన్ని యాడ్స్ లో నటించాను. "డ్రింకర్ సాయి"తో హీరోయిన్ గా మీ ముందుకు వస్తున్నా. తెలుగమ్మాయిని కాకపోవడం వల్ల డైలాగ్స్ చెప్పేప్పుడు ఇబ్బందిగా ఉండేది. నేను ఏ డైలాగ్ చెబుతున్నాను అనేది అర్థమయ్యేది కాదు. ఈ సినిమా చేసేప్పుడు భాష ఒక్కటే నేను ఎదుర్కొన్న సమస్య. అది తప్ప సెట్ లో నటిస్తున్నప్పుడు బాగా ఎంజాయ్ చేశాను.

# అనుపమ, సురేష్‌గోపి జానకి వెర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ



సూపర్ స్టార్ సురేష్ గోపి అనుపమ పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో కాస్మోస్ ఎంటర్‌టైన్మెంట్స్ పై జె. ఫణీంద్ర కుమార్ నిర్మాతగా ప్రవీణ్ నారాయణ దర్శకత్వంలో వస్తున్న యదార్థ సంఘటనల ఆధారంగా వాస్తవిక దృక్పధ కోణంలో తీసిన సినిమా జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (జె. ఎస్. కె). బైజు సందోష్, మాధవ్ సురేష్ గోపి, దివ్య పిళ్లయి, అస్కర్ అలీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఇంటెన్స్ కోర్టు డ్రామాగా ఈ చిత్రాన్ని నిర్మించారు. అనుపమ పరమేశ్వరన్ సినిమాలో జానకి పాత్రలో నటిస్తోంది. యదార్థ సంఘటన ఆధారంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో జానకి పై జరిగిన అన్యాయాన్ని కోర్టులో ఎలా ఎదుర్కొంది అన్న అంశాన్ని ఇంటెన్స్ డ్రామాగా నిర్మించారు. ఈ కేసును వాదించే లాయర్ పాత్రలో సూపర్ స్టార్ సురేష్ గోపి నటించారు. ఈ సినిమాని ఫిబ్రవరిలో విడుదల చేస్తామని మూవీ మేకర్స్ తెలిపారు.

# డిసెంబర్ 27న 'ఓ తండ్రి తీర్పు'

ఏవికె ఫిలిమ్స్ బ్యానర్ పై లయన్ ఆరిగపూడి విజయ్ కుమార్ సమర్పణలో లయన్ శ్రీరామ్ దత్తి నిర్మాతగా, రాజేంద్ర రాజు కాంచనపల్లి రచన దర్శకత్వ పర్యవేక్షణలో ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో వివ రెడ్డి హీరోగా 'ఓ తండ్రి తీర్పు' సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. సహృదయులు దైవాంశ సంభూతులు డాక్టర్ కెవి రమణ చారి ఆశీస్సులతో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

ఈ సినిమా ద్వారా వివ రెడ్డి హీరోగా పరిచయం అవుతున్నారు. ప్రతాప్ భీమవరుపు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు రచన పర్యవేక్షణ రాజేంద్రరాజు కాంచనపల్లి. కుటుంబ విలువలతో ఓ తండ్రి తీర్పు సినిమాను నిర్మించారు. తల్లిదండ్రుల ఆస్తులపై ఉన్న ప్రేమ తల్లిదండ్రులపై లేకపోవటం ఎంతటి మానసిక క్షోభకు గురిచేస్తుందో ఇతివృత్తంగా ఈ సినిమా ఉంటుంది. ఓ తండ్రి తీర్పు పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి అయ్యాయి.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144